

పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న పవన్ కళ్యాణ్



- రూ.15వేల కోట్ల ప్రతిపాదనలకు ముందడుగు
- ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి నిధులు
- రాజధాని నిర్మాణ ప్రణాళికల రూపకల్పనకు ప్రభుత్వం ఆదేశాలు
- ఆదివారం జీవో జారీ చేసిన పురపాలక శాఖ

అమరావతి అభివృద్ధి పరుగులు

రాజధాని అమరావతి నిర్మాణం ఇకపై పరుగులు పెట్టనుంది. రాజధాని నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు నుంచి అందనున్న నిధుల వినియోగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ సీఆర్డీఏకు తాజాగా జీవో జారీ చేసింది. అమరావతి నగర అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన ప్రణాళికలు అమలు చేయాలని సీఆర్డీఏకు పురపాలక శాఖ ఆ జీవోలో పేర్కొంది.

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధానిగా అ మరావతిని అభివృద్ధి చేయాలని, అందుకోసం చేపట్టాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలని సీఆర్డీఏను ప్రభుత్వం ఆదేశించింది. రాజధాని అమరావతికి ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు సంయుక్తంగా రూ.15వేల కోట్ల రుణ సహకారాన్ని అందించనున్నట్లు ఆ జీవోలో ప్రభుత్వం స్పష్టంచేసింది. ఆ నిధులతో రాజధానిలో అత్యున్నత ప్రమాణాలతో మౌలిక సదుపాయాల, వసతులు, హరిత నిర్మాణాలు, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉండేలా సుస్థిరాభివృద్ధి కార్యచరణను చేపట్టాలని పేర్కొంది. రాజధానిలో ప్రధాన రహదారులు, తప్పనిసరి అవసరాలకోసం వినియోగించే యుటిలిటీ డక్ట్‌లు, వర్షపు నీరు, వరద నీటి ప్రవాహాన్ని నియంత్రించేలా డ్రెయిన్‌లు, వరద కాలువలు నిర్మించాలని జీవోలో స్పష్టం చేసింది. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ జోన్లలో హరిత క్షేత్రాలు ఏర్పాటుచేయాలని, 24 గంటలూ స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, మానవ వ్యర్థాలను నిర్వహించే సీవరేజ్ వ్యవస్థను నిర్మించాలని, హరిత నియమావళికి అనుగుణంగా ప్రభుత్వ భవనాలు నిర్మించాలని, భవనాల పటిష్ఠతను పెంపొందించాలని, అందుకనుగుణంగా కొత్త పద్ధతుల్లో నిధుల సమీకరణ పద్ధతులను అవలంభించాలని పురపాలక శాఖ సీఆర్డీఏకి తెలిపింది.

● సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు

రాజధాని అమరావతి సుస్థిరాభివృద్ధికి సీఆర్డీఏ ప్రతిపాదనలు సమర్పించగా కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ ప్రతిపాదనలకు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి కూడా ఆమోదం లభించినట్లు తెలిపింది. ప్రోగ్రామ్ ఫర్ రిజల్ట్స్(పీ ఫర్ ఆర్), రిసల్ట్ బేస్డ్ లెండింగ్(ఆర్‌బీఎల్) కార్యక్రమాల కింద ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు చెరో 800 మిలియన్ డాలర్ల నిధులు అందించనున్నాయి. మిగిలిన నిధులు కేంద్ర సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చుకోనున్నామని తెలిపింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం పొందేందుకు ఏపీ సీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అభివృద్ధి ప్రణాళికల ఆధారంగా దశలవారీగా బ్యాంకుల నుంచి నిధుల పొందే అవకాశం ఉండడంతో అందుకోసం ప్రత్యేక బ్యాంకు ఖాతా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతి నిర్మాణ ప్రణాళిక కోసం బడ్జెట్లో ప్రత్యేక కేటాయింపులతో పాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ మొత్తం కార్యక్రమం, ప్రణాళికలు సీఆర్డీఏ కమిషనర్ అధీనంలో జరగనున్నట్లు జీవోలో పురపాలక శాఖ స్పష్టం చేసింది.



సభలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు తదితరులు

అటవీ సంరక్షణలో.. అధికారులకు స్వేచ్ఛ

- అమరవీరులను స్మరించుకోవడం మన బాధ్యత
- భావితరాలు గుర్తుంచుకునేలా విగ్రహాల ఏర్పాటు
- భవనాలకు అమర వీరుల పేర్లు
- అటవీ సంపదను నాశనం చేస్తే కఠిన చర్యలు
- టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేసే అవకాశం
- చెట్ల నరికివేతపై వాల్టా చట్టం కింద చర్యలు
- సరస్వతి భూముల్లో అక్రమాలపై విచారణ చేపడతాం
- అటవీ అమరవీరుల సంస్మరణ దినం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

గుంటూరు(తూర్పు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిధులు, సిబ్బంది కొరతను అధిగమించి అటవీ శాఖను అభివృద్ధి పథంలో నిలుపుతాం. వనరులను పరిరక్షించి అటవీ సంపదను కాపాడి భవిష్యత్తుతరాలకు అందజేయడం బాధ్యతగా భావిస్తున్నాను. అడవుల రక్షణకు అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నాం. ప్రకృతి వనరుల దోపిడీని అరికట్టేందుకు ఇప్పటికే టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశాం. ఆ నంబర్‌కి కాల్ చేస్తే ఇతర శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుని అడ్డగోలు దోపిడీకి అడ్డుకట్ట వేస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఆదివారం గుంటూరు అరణ్య భవన్‌లో జరిగిన రాష్ట్ర అటవీ అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని స్మారక స్థూపం వద్ద అటవీశాఖ ఉన్నతాధికారులతో కలసి అమర వీరులకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరుల

(మిగతా 6వ పేజీలో..)




అమవీరుల కుటుంబసభ్యులకు పండ్లు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

పడకేసిన ప్రాజెక్టులు..


కూటమిపైనే ఆశలు
















- సాగునీటి ప్రాజెక్టులకు చిల్లిగవ్వ ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వం వచ్చాక కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేల ప్రత్యేక దృష్టి
- శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి బడ్జెట్‌లో చోటు దక్కుతుందని ఆశిస్తున్న ప్రజలు

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రప్రథమంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయి బడ్జెట్ సోమవారం అసెంబ్లీ ముందుకు రానుంది. అంతకంటే ముందు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదించిన తర్వాత అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు. సూపర్ సిక్స్‌తో పాటు మరికొన్ని హామీలను నియోజకవర్గాల వారీగా కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చారు. వాటికి కార్యరూపం ఇస్తూ బడ్జెట్ ప్రతిపాదనలు రూపుదిద్దుకొన్నట్లు సమాచారం. ముఖ్యంగా జిల్లాలో పడకేసిన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లేందుకు ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరుగుతుందని అందరూ ఆశిస్తున్నారు. దీంతో పాటుగా అమరావతి రాజధాని, రైల్వే ప్రాజెక్టుల్లో రాష్ట్ర ప్రభుత్వం వాటా, శంకర్‌విలాస్ ఆర్‌వోబీ తదితర ప్రాజెక్టులకు బడ్జెట్‌లో నిధులు పొందుపరిస్తే రాబోయే రెండు, మూడు ఏళ్లలో అవి పూర్తి అయ్యే అవకాశం ఉంటుంది.

గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, పొడిగింపు పనులు అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇందుకు కారణం గత ఆగస్టు/సెప్టెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు ఎక్కడికక్కడ ఛానల్‌తో పాటు పలు వాగుల గట్లు తెగిపోయి పంట పొలాలు నీటమునిగాయి. దాంతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఢిల్లీ నుంచి ఒక బృందాన్ని పంపించి అధ్యయనం కూడా చేయించారు. 2014-19 మధ్యన అప్పటి టీడీపీ ప్రభుత్వం గుంటూరు ఛానల్, నల్లమడ డ్రెయిన్ల ఆధునికీకరణకు నిధులు మంజూరు చేసింది. పరిపాలన, సాంకేతిక అనుమతులను కూడా ఇచ్చింది. టెండర్లు నిర్వహించి ఏజెన్సీలను ఖరారు చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం వాటిని రివర్స్ టెండరింగ్ పేరుతో రద్దు చేసి ఐదేళ్ల కాలయాపన చేసింది. గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ కోసం భూసేకరణకు రూ. 103 కోట్ల నిధులు అవసరమౌతాయి. ఇప్పటికే ప్రాథమిక నోటిఫికేషన్లను కూడా విడుదల చేశారు. ఎంతో కొంత నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తే భూసేకరణ ప్రక్రియలో అడుగులు ముందుకు పడతాయి. ఇటీవల ప్రత్తిపాడు నియోజకవర్గ పర్యటనకు సీఎం చంద్రబాబు వచ్చినప్పుడు నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణ పూర్తి చేసి తీరుతామని హామీ ఇచ్చారు. దీని దృష్ట్యా బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి కొంత నిధులను ఈ ఏడాది కేటాయిస్తే వచ్చే సంవత్సరం నుంచి కేటాయింపులు పెంచేలా ఒత్తిడి చేయొచ్చు.

గుంటూరు నగర ప్రజలు ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారు. దీనికి కొంత పరిష్కారమార్గంగా శంకర్‌విలాస్ ఆర్‌వోబీని నాలుగు వరసలకు అభివృద్ధి చేసేందుకు కేంద్రాన్ని మంత్రి పెమ్మసాని ఒప్పించారు. అయితే ఈ వంతెన విస్తరణ, పొడిగింపునకు భూసేకరణ చేయాలి. దానికే రూ. కోట్లలో నిధులు అవసరమవుతాయి. అలానే అప్రోచ్‌ల నిర్మాణాన్ని నగరపాలకసంస్థ చూసుకోవాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే తప్ప పనులు ముందుకు సాగవు. దీని దృష్ట్యా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని నగరవాసులు కోరుకొంటున్నారు. నగర శివారులోని క్రిష్టియన్ భవన్, బీఆర్ స్టేడియం వద్ద ఉన్న కోడిగుడ్డు సత్రంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్, ఏసీ కళాశాల వద్ద అంబేడ్కర్ భవన్, బ్రహ్మానందరెడ్డి స్టేడియం అభివృద్ధికి నిధులు అవసరం ఉన్నది. వీటికి ప్రభుత్వం ఇస్తేనే ఆయా పనులు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. పర్యాటకరంగం అభివృద్ధి కోసం కూడా కూటమి ప్రభుత్వం నిధులు వెచ్చించాలి. ఉప్పలపాడు పక్షి కేంద్రం, పేరేచర్ల నగరవనం, ఉండవల్లి గుహలు తదితర సందర్శన ప్రదేశాలకు హంగులు అద్దాలి. అప్పుడే పర్యాటకులను ఆకర్షించ వచ్చు. కాగా సూపర్ సిక్స్‌లో రెండు హామీలు పించన్ రూ. 4 వేలకు పెంపు, ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితం పథకాలను ఇప్పటికే కూటమి ప్రభుత్వం అమలు చేసింది. అలానే ఉద్యోగాల కల్పనలో భాగంగా మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ని విడుదల చేసింది. తల్లికి వందనం, ఏటా రైతులకు రూ. 20 వేల పెట్టుబడిసాయం, ప్రతీ మహిళకు నెలకు రూ. 1500, ఉచిత బస్సు ప్రయాణం హామీలను అమలు చేయాల్సి ఉన్నది. వాటికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రతీ ఒక్కరూ కోరుకొంటున్నారు.



సూర్యలంక తీరం.. జనసంద్రం

8

- వినూత్న వంటకాల తయారీలో ఫుడ్ సైన్స్ కళాశాల
- మార్కెటింగ్ మెలకువల్లోనూ శిక్షణ



రుచీ.. శుచీ నేర్పుతారు

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

పట్టుదలతో విజయాన్ని సాధించాలి

కారంచల్లి కత్తులతో హత్య

6

క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో ప్రథమ స్థానం పొందిన గుంటూరు జిల్లా జట్టు

కొరతతో.. కొరవడిన పర్యవేక్షణ

- మూడు జిల్లాల్లోని మునిసిపాల్టీలలో సరిపడాలేని ఏఈలు
- ప్రగతి పనులపై కొరవడిన పర్యవేక్షణ
- ఏఈలుగా సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు
- నియమాకాలపై కసరత్తు.. జిల్లాల వారీగా జాబితాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాలిటీల్లో ఏఈల కొరత కారణంగా ప్రగతి పనులు కుంటు పడుతున్నాయి. కాంట్రాక్టు ఉద్యోగ స్తులపై ఆధారపడి అభివృద్ధి పనులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో, ప్రగతి పనులపై పర్యవేక్షణ లేక, ఆయా పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకరంగా మారుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా మునిసిపాల్టీలలో ఖాళీగా ఉన్న ఏఈ పోస్టుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఆయా పోస్టులు ఇప్పట్లో భర్తీ అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో, ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు మునిసిపల్ పరిపాలనా విభాగం చర్యలు చేపడుతోంది. పురపాలక సంఘాల్లోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఎమినిటీ కార్యదర్శులను తాత్కా లిక ఏఈలుగా నియమించే దిశగా కసరత్తు జరుగుతోంది.

ఏఈల ఖాళీలను గుర్తిస్తున్నాం

ఎమినిటీ కార్యదర్శులను తాత్కాలికంగా ఏఈలుగా నియమించే అంశంపై మునిసిపల్ శాఖ ఈఎన్‌సీ మరియన్నను వివరణ అడగ్గా ఇది వాస్తవమేనన్నారు. ముందుగా ఏఈల ఖాళీలను గుర్తిస్తున్నట్లు చెప్పారు. అర్హత కలిగిన ఎమినిటీ కార్యదర్శులను పని ఏర్పాట్లు కింద ఏఈలుగా నియమిం చేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

మూడు జిల్లాల్లో 35 పోస్టులు ఖాళీ

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాల్టీల్లో 35 వరకు ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏఈ పోస్టులు ఏపీపీఎస్‌ఈ ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. గత ఐదేళ్లలో ఈ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడలేదు. దీంతో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏఈలకు డీఈ ఈలుగా ప్రమోషన్‌లు రావడంతో ఖాళీల సంఖ్య పెరిగింది. ఏపీపీఎస్‌ఈ ద్వారా ఇప్పట్లో ఏఈల నియామకాలు జరిగే పరిస్థితులు లేవనే చెప్పాలి. ఇప్పటికిప్పుడు నోటిఫికేషన్ ఇచ్చినా ప్రక్రియ పూర్తయ్యే సరికి కనీసం ఏడాదిన్నర కాలం అవుతుందని అంచనా. నేరుగా ఏఈ పోస్టులు భర్తీ చేసే పరిస్థితులు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాలను పబ్లిక్ హెల్త్ శాఖ అన్వేషిస్తోంది. దీనిలో భాగంగా మునిసిపాల్టీలలో వార్డు సచివాలయల్లో ఎమినిటీ కార్యదర్శులుగా పనిచేస్తున్న వారితో ఏఈ పోస్టులు త్కాత్కాలికంగా భర్తీ చేయాలని ఆ శాఖ యోచిస్తోంది. మూడు జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించిన జాబితాలను ఇప్పటికే సిద్ధం చేశారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఎమినిటీ కార్యదుృలకు విద్యా పరంగా ఏఈలుగా నియమించే అర్హత ఉంది. దీంతో, వీరిలో ప్రతిభావంతులను గుర్తించి వారికి మునిసిపాల్టీల్లో ఏఈలుగా వర్కింగ్ ఎరేంజ్‌మెంట్స్ కింద నియమించేందుకు పూర్తి స్థాయిలో కసరత్తు జరుగుతోంది. జాబితాను రూపొందించేందుకు ఓ ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఇది కార్యరూపం దాల్చితే మునిసిపాలిటీలో ఏఈల కొరత తీరుతుందని చెప్పవచ్చు. ఖాళీగా ఉన్న డీఈ పోస్టుల భర్తీకి కూడా చర్యలు చేపట్టారు. ఏఈలకు డీఈ పోస్టుల్లో వర్కింగ్ ఎరేంజ్‌మెంట్స్ కింద నియమించనున్నారు.



దళితులను అణగదొక్కిన జగన్

● మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి



తాడేపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జగన్ దళితులకు మేనమామనని చెప్పుకొని దళితులను అణగదొక్కాడని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. ఆదివారం తాడేపల్లిలోని మాదిగ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీదేవి మాట్లాడుతూ కార్పొరేషన్ నిధులతో దళితులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. జగన్ ప్రభుత్వంలో దళితులకు ఇచ్చే పథకాలు నిలిపివేశారన్నారు. అమరావతి అభివృద్ధి చెందితే దళితులకు ఉద్యోగాలు వస్తాయన్నారు. దళితులను చంపిన వైసీపీ నేతలు అనంతబాబు, నందిగం సురేష్‌కు జగన్ అండగా నిలిచారన్నారు. దళిత డాక్టర్ సుధాకర్ మాస్క్ అడిగితే వేధించి చంపారన్నారు. జగన్ అమలు చేసింది నవరత్నాలు కాదని, నవ మోసాలు అని వ్యాఖ్యానించారు. చదువుకున్న నన్ను గుర్తించి చంద్రబాబు అవకాశం కల్పించారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్, పురందరేశ్వరికి ధన్యవాదాలు చెప్పారు.

14న పెదకాకానికి షర్మిల రాక

పెదకాకాని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెదకాకానిలో ఏర్పాటు చేసిన నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీల విగ్రహాల ఆవిష్కరణకు ఈ నెల 14న ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వస్తున్నట్లు గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకా విజయ్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా పెదకాకానిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర మాజీ కేంద్ర మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొంటారు. కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంతేటి యలమందరావు. జొన్నల వెంకటరెడ్డి. కండెల నాగరాజు. షేక్ నాగుల్ మీరా. బొందలపాటి పెద్ద రంగయ్య. బెజ్జం రాజేష్. బట్టు దిలీప్ పాల్గొన్నారు.

దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

పెదకాకాని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఈనెల 9న నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదల అయ్యాయి. ఈ మేరకు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల కో ఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ప్రవేశ పరీక్షకు 201 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 188 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో 184 మంది అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలు నవంబరు 15తో ముగుస్తాయని తెలిపారు. ప్రవేశ పరీక్షలో అర్హులైన వారి జాబితాను దూరవిద్య కేంద్రం వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అలాగే ఏపీ ఐసెట్ 2024లో అర్హత సాధించిన విద్యార్థులు ప్రవేశాలు పొందవచ్చన్నారు.

రేపు వెంకట నరసయ్య స్మారక వ్యాస రచన పోటీలు

పెదకూరపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడుకు చెందిన కవిబ్రహ్మ వేటుకూరి వెంకట నరసయ్య 75వ వర్ధంతి సందర్భంగా పెదకూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈనెల 12వ తేదీ ఉదయం వ్యాస రచన పోటీలు జరుగుతాయని పెదకూరపాడు అభివృద్ధి వేదిక కన్వీనర్, ప్రజా కవి దర్శి శేషారావు ఆదివారం తెలిపారు. ఈ పోటీలు ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఆరు నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవయుగ కవి చక్రవర్తి జాషువాపై ఈ వ్యాస రచన పోటీ జరుగుతుందని, ఆసక్తి గల వారు 8790682858 నంబరులో గాని, ప్రధానోపాధ్యాయులు వెంకట రమణ 8309754060 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పట్టుదలతో విజయాన్ని సాధించాలి

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

తాడికొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో విజయాన్ని సాధించాలని రూరల్ డెవలప్‌మెంట్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం తాడికొండలోని ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలో బాగు చేయించిన టీచర్స్ క్వార్టర్స్, ప్రహరీ గోడను కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ముందుగా పాఠశాల గ్రంథాలయాన్ని పరిశీలించారు. పాఠశాల స్థాపించిన దగ్గర నుంచి ప్రస్తుతం వరకు ఉన్న విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధ్యాపకులు కేంద్రమంత్రికి వివరించారు. అంతేకాకుండా పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, టీచర్స్ కొరత, జీతభత్యాలు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జీవితంలో గొప్ప ఆశయాలను కలలు కనాలని సూచించారు. పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న పూర్వవిద్యార్థులను అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో పాఠశాల, కమ్యూనిటి హాల్, వాకింగ్ ట్రాక్ ఇలా కనీస వసతులు కల్పించే విధంగా 5 ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. అనంతరం పాఠశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ స్కూల్ సెక్రటరీ మస్తానయ్య, బీజేపీ నాయకులు తాళ్ల శ్రీనివాస్ యాదవ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంతేటి బ్రహ్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, ధనేకుల సుబ్బారావు, సీనియర్ నాయకులు ఎడ్లూరి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, గుంటుపల్లి మధుసూదనరావు, చిగురుపాటి అనూప్, గడ్డిపాటి సాంబశివరావు, ఎంపీడీవో సమతావాణి, తహసీల్దార్ నాసరయ్య, ఎంఈవో తెనాలి ఇందిరా, పాఠశాల ప్రిన్సిపాల్ పి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

హోరాహోరీగా బేస్‌బాల్ పోటీలు



బేస్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ప్రత్తిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలు రెండో రోజు ముగిశాయి. బాలురు, బాలిక విభాగాల్లో ఆదివారం జరిగిన పోటీలను అబ్జర్వర్ శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగాధరరావు ఫలితాలను వివరించారు. బాలుర విభాగంలో.. గుంటూరు, విజయనగరం జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో విజయనగరం జట్టు 05-06 పాయింట్ల తేడాతో గెలుపొందింది. కృష్ణా, ప్రకాశం జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు 06-01 పాయింట్ల తేడాతో, కర్నూలు, విశాఖపట్నం జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో కర్నూలు జట్టు 04-02 పాయింట్లతో, కడప, శ్రీకాకుళం జిల్లాల మధ్య జరిగిన పోటీలో శ్రీకాకుళం 05-04 పాయింట్లతో గెలుపొందాయి. బాలికల విభాగంలో.. ప్రకాశం, అనంతపురం జిల్లాల మధ్య జరిగిన పోటీలో ప్రకాశం 10-00 పాయింట్లతో గెలుపొందింది. కడప, గుంటూరు జిల్లాల మధ్య జరిగిన పోటీలో గుంటూరు జట్టు 0-5 పాయింట్లతో, శ్రీకాకుళం, చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో శ్రీకాకుళం జట్టు 06-00 పాయింట్లతో, కర్నూలు, విజయనగరం జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో కర్నూలు జట్టు 03-01 పాయింట్లతో గెలుపొందింది. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ చౌదరి బాబు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రత్తిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న భారీ పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం మెరుపుదాడి చేశారు. చినకోండ్రుపాడు సమీపంలో జాతీయ రహదారి పక్కన కిట్స్ కళాశాలకు వెళ్లే దారిలో ఒక రేకుల షెడ్డుతో పాటు చుట్టూ ప్రహరీ ఉన్న బహిరంగ ప్రదేశంలో కొంతకాలంగా పేకాట స్థావరం నడుస్తుంది. ఇక్కడికి ప్రత్తిపాడుతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పేకాట రాయుళ్లు వచ్చి లక్షల్లో పందేలు కాస్తూ కోతముక్క ఆడుతున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ప్రత్తిపాడు సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర, సిబ్బంది ఈ దాడులు నిర్వహించారు. సుమారు యాభై మంది వరకు పేకాట ఆడుతున్నట్లు తెలిసింది. దాడి చేసిన సమయంలో కొంతమంది పారిపోయారు. ఈ దాడుల్లో వారి వద్ద ఉన్న రూ. 93,600 నగదును స్వాధీనం చేసుకుని 38 మందిని అరెస్టు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

అటవీ సంరక్షణలో.. అధికారులకు స్వేచ్ఛ

(5పేజీ తరువాయి)

కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడారు. అటవీ సంపద దోచుకునే స్మగ్లర్లు, అరాచక ముఠాలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించి వీర మరణం పొందిన అటవీ సిబ్బంది త్యాగాలు వృథా కానివ్వకుండా, వారి ఆశయాలకు అనుగుణంగా మనం పని చేయాలి. విధి నిర్వహణలో అశువులు బాసిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. రాజకీయ నాయకులు వాళ్ల ముందర కాళ్లకు బంధాలు వేయకుండా వాళ్ల పని వాళ్లను చేసుకోనిస్తే సరిపోతుందన్నారు.

సంజీవని పథకం ద్వారా నిధులు

అటవీ సంపద సంరక్షణలో కీర్తిచక్ర అవార్డు గ్రహీత దివంగత పందిళ్లపల్లి శ్రీనివాస్‌తో సహా 23 మంది అటవీ సిబ్బంది అమరులయ్యారు. అటవీ అధికారులు గంధపు చెక్కలు, ఏనుగు దంతాల స్మగ్లర్ వీరప్పన్‌తో పోరాటం చేసి శ్రీనివాస్ ప్రాణాలు వదిలారు. వీరి త్యాగాలను మనతో పాటు భావితరాలు మరిచిపోకూడదు. భవిష్యత్ తరాలు గుర్తించుకునేలా విగ్రహాల ఏర్పాటు చేస్తాం. నగర వనాలు, అటవీ శాఖ భవనాలకు వారి పేర్లు పెడతాం. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడానికి తీసుకొచ్చిన సంజీవని పథకానికి పారిశ్రామికవేత్తలు, దాతలతో మాట్లాడి రూ. 5 కోట్ల నిధులు సమీకరిస్తాం. అమరవీరుల స్తూపాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. .

సరస్వతి పవర్ భూముల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేపడతాం...

లా అండ్ ఆర్డర్ సమస్యలతోపాటు సరస్వతి పవర్ భూముల్లో 76 ఎకరాలు అసైన్డ్ భూములు, చుక్కల భూములు ఆక్రమించేశారు. దీనితోపాటు వాగులు వంకల సంరక్షణ బాధ్యత కూడా ఉంది. అటవీ శాఖ అధికారులతో ఈ అంశంపై చర్చిస్తున్నాము. పవర్ ప్లాంట్ పరిధిలో గ్రీన్ జోన్ ఏర్పాటు చేయాలి. కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు కూడా లేవు. సరస్వతి పవర్ వ్యవహారంలో పాల్పడిన ఉల్లంఘనలన్నింటిని పరిశీలించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పవన్ కల్యాణ్ చెప్పారు.

చెట్ల నరికివేతపై వాల్టా చట్టం కింద చర్యలు

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పర్యటనల పేరిట ఇష్టానుసారం రోడ్ల పక్కన ఉన్న చెట్లు నరికేశారు. ఈ చర్యలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీశాయి. ఈ వ్యవహారంలో బాధ్యులపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాము. చెట్ల నరికివేత మీద చర్యలు మొదలుపెడితే వైసీపీలో ఉన్న చాలా మంది నాయకులు ఊచలు లెక్కపెట్టాల్సి ఉంటుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెట్ల నరికివేతపై మేము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పోలీస్ శాఖ స్పందించలేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవతేజ, నగర కమీషనర్ పులి శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి, ఉన్నతాధికారులు కజురియా, ఎస్.ఎస్. శ్రీధర్, రాహుల్ పాండే తదితరులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటనలో అపశ్రుతి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. కాన్వాయ్‌లోని ఓ కారును రోడ్డుపై సిబ్బంది అడ్డంగా నిలిపారు. సరిగ్గా అదే సమయంలో వస్తున్న అంబులెన్స్ కారును చూసి ఆగింది. ఆ సమయంలో అంబులెన్స్‌లో ఉన్న రోగికి ప్రాణపాయ స్థితి ఏర్పడింది. దీంతో పోలీసుల సహకారంతో అంబులెన్స్ సిబ్బంది రోడ్డుపైనే ప్రథమ చికిత్స నిర్వహించారు.

క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

సత్తెనపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక శరభయ్య గుప్తా హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో కొనసాగిన అండర్-19 రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో విజేతలకు ఆదివారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రీడల పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో సానుకూలంగా పని చేస్తున్నారన్నారు. క్రీడాకారులకు ఉద్యోగాల్లో ఉన్న రెండు శాతం రిజర్వేషన్‌ను మూడు శాతానికి పెంచి క్రీడాభివృద్ధికి దోహద పడుతున్నారన్నారు. సత్తెనపల్లిలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలను విజయవంతం చేసిన నిర్వాహకులను కన్నా అభినందించి సత్కరించారు.

విజేతలు వీరే..

రాష్ట్ర స్థాయిలో బాలుర విభాగంలో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని, విశాఖపట్నం జట్టు ద్వితీయ స్థానాన్ని, కర్నూలు జట్టు తృతీయ స్థానాన్ని, విజయనగరం జిల్లా జట్టు నాలుగో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో మొదటి స్థానాన్ని అనంతపురం జట్టు, రెండో స్థానాన్ని వైఎస్ఆర్ కడప జిల్లా, మూడో స్థానాన్ని గుంటూరు జిల్లా, నాలుగో స్థానాన్ని విశాఖపట్నం జిల్లా జట్టు కైవసం చేసుకున్నాయి. విజేతలకు ఎమ్మెల్యే కన్నా బహుమతులను అందించారు. టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, ఆళ్ల అమరేశ్వరరావు, కంభాల వెంకటేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, ప్రగతి విద్యా సంస్థల అధినేత మక్కెన అచ్చయ్య, ప్రిన్సిపల్ రాయపాటి శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్ పద్మాకర్, నిర్వాహకులు పి.శివరామకృష్ణ, ఎస్ సుధాకర్‌రెడ్డి, లాకు పిచ్చయ్య, అనీల్ దత్తా నాయక్ పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన అనంతపురం జిల్లా బాలికల జట్టు

కారంచల్లి కత్తులతో హత్య



హత్యకు గురైన యువకుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పొన్నూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేటాడి వెంటాడి కారంచల్లి కత్తులతో పొడిచి హత్య చేసిన సంఘటన పొన్నూరు మండలం ములుకుదురు గ్రామంలో ఆదివారం జరిగింది. రూరల్ పోలీసులు, హతుడి బంధువులు కథనం ప్రకారం మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన నక్కల దేవరాజ్ విద్యుత్ మీటర్ల రీడింగ్ తీస్తూ జీవనం సాగిస్తున్నాడు. దేవరాజు ఆదివారం ములుకుదురు గ్రామం పరిధిలో పంట పొలాల వద్ద హత్యకు గురైనట్లు బంధువులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హత్య జరిగిన తీరు చూసి స్థానికులు హడలిపోతున్నారు. దేవరాజును వేటాడి వెంటాడి కారం చల్లి కత్తులతో పొడిచి చంపినట్లు పోలీసులు గుర్తించారు. పథకం ప్రకారమే కాపుకాచి విచక్షణా రహితంగా రాడ్లతో కొట్టి కత్తులతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. హత్య సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్సై గండు కిరణ్, సీఐ వై.కోటేశ్వరరావు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఈ హత్యకు కుల వివక్షతే కారణం అని మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణం అని పోలీసులు అనుమానిస్తున్నారు. గ్రామానికి చెందిన ఓ విడాకులు తీసుకున్న మహిళతో దేవరాజు వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో సదరు యువతి మరోవ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న నేపథ్యంలో ఇరువురి మధ్య వివాదం చెలరేగి ఈ హత్యకు దారితీసినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి..

దళితులపై జరుగుతున్న దాడులను తక్షణమే అరికట్టాలని, హతుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఆదివారం ములుకుదురులో దళిత సంఘాల నాయకులు ధర్నాకు దిగారు. దేవరాజు హత్య సమాచారం తెలుసుకున్న నాయకులు పెద్ద ఎత్తున ములుకుదురు గ్రామంలోని జీబీసీ రోడ్డుపైకి చేరుకుని రాస్తారోకో నిర్వహించారు.

దాతలు సహకరిస్తే.. ఊపిరి నిలుస్తుంది

నరసరావుపేట టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతురులో నివాసం ఉంటున్న చేజర్ల శంకర్ మైలాటిస్ అనే వ్యాధితో బాధ పడుతూ 18 ఏళ్లగా మంచానికే పరిమితమై బతుకు పోరాటం చేస్తున్నారు. ఆయన జీవించి ఉండాలంటే సర్వేంటిలేటర్ అవసరం. ఆ యంత్రం ఆడితేనే అతని శ్వాస ఆడతుంది. దాతలు ఇచ్చిన సర్వేంటిలేటర్‌తో ఆయన భార్య కవిత సేవలతో ఇప్పటి వరకు జీవనం సాగించారు. అయితే సర్వేంటిలేటర్ నిర్వహణ వారికి తలకుమించిన భారం అయింది. ఆ యంత్రంలోని ట్రైకాస్టమి ట్యూబ్, కేతట్రామౌంట్, బాక్టీరియల్ వైరల్ ఫిల్టర్, సక్షన్ ట్యూబ్, వెంటిలేటర్ ట్యూబ్, యూరిన్ కేతట్రా, గ్లౌజ్ బాక్స్ తదితర వస్తువుల నిర్వహణకు నెలకు రూ.11 వేలు ఖర్చు అవుతుందని శంకర్ తెలిపారు. దీనికితోడు ప్రభుత్వం టిడ్కో గృహాల్లో కేటాయించిన ఇంటికి లోను కట్టాలని బ్యాంక్ మేనేజర్ ఫోను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 18లోపు కట్టకపోతే బ్లాక్ లిస్ట్‌లో పెడతామని చెప్పారన్నారు. ప్రభుత్వం పింఛన్‌గా రూ.10 వేలు ఇస్తుందని తెలిపారు. గతంలో ఆర్ఎంపీగా పనిచేసి జీవనం సాగించిన చేజర్ల శంకర్ కుటుంబానికి ఎలాంటి ఆదాయం లేకపోవడం ఇబ్బందిగా పరిణమించింది. పూర్తిగా మంచంపై ఉన్నవారికి రూ.15 వేలు ఇస్తామని చెప్పారని, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదుకుంటారని ఆశతో ఎదురు చూస్తున్నానని అన్నారు. తన భార్య కవితకు మోకాలి శస్త్రచికిత్స జరిగిందని, ఆమె కూడా ఏ పని చేయలేదని వివరించారు. దాతలు సహకరించాలని కోరారు. సహాయం చేయాలనుకున్న దాతలు 7981262549 నంబరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.



సర్వేంటిలేటర్‌పై ఉన్న చేజర్ల శంకర్

అంజుమన్ స్థలం లీజుకిచ్చే అధికారం కేర్‌టేకర్ కమిటీకి లేదు

● ముస్లిం మైనార్టీ సమితి నేత నాగూల్ మీరా

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంజుమన్‌కు కేర్ టేకర్ కమిటీని నియమించే అధికారం ప్రస్తుతం వక్ఫ్‌బోర్డుకు లేదని ముస్లిం మైనార్టీ సమితి నేత నాగూల్ మీరా అన్నారు. స్థానిక నగరంపాలెం ఈద్గా వద్ద ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అసలు వక్ఫ్ బోర్డుకు ప్రస్తుతం పాలకవర్గం లేదన్నారు. అలాంటిది అంజుమన్‌కి కేర్ టేకర్ కమిటీని ఎలా వేశారన్నది అర్థం కావడం లేదని చెప్పారు. ఒకవేళ కమిటీ వేయాలనుకుంటే ప్రభుత్వం నుంచి నిర్దిష్టమైన అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. అలానే ఆస్తులు లీజులకు ఇవ్వాలంటే కచ్చితంగా వక్ఫ్‌బోర్డు మీటింగ్ అజెండాలో పెట్టాల్సి ఉందన్నారు. ఆస్తులు లీజుకు ఇచ్చే విషయంలో కేవలం ముతవల్లికి మాత్రమే 11 నెలల ఇవ్వగలిగిన అధికారం ఉంది తప్పా ప్రభుత్వం/వక్ఫ్‌బోర్డు/కేర్‌టేకర్ కమిటీకి లేదని స్పష్టం చేశారు.

ప్రణవపీఠం -గుడిబడి ఆధ్వర్యంలో ఆలయంలో పరిశుభ్రత

గుంటూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రణవ పీఠం-గుడి బడి ఆధ్వర్యంలో స్థానిక సంపతనగర్‌లోని శృంగేరి శారదా అమ్మవారి దేవాలయంలో పరిశుభ్రత కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. దాదాపు 25 మంది ఆలయం మొత్తం బూజులు దులిపి, కడిగి శుభ్రం చేశారు. శృంగేరి జగద్గురువులు శ్రీ విధుశేఖర భారతి మహాస్వామి గుంటూరు రాక సందర్భంగా ఈ వారం, వచ్చే ఆదివారం కూడ ఇక్కడే సేవా కార్యక్రమం చేయాలని తమ గురుదేవులు శ్రీ వద్దిపర్తి పద్మాకర్ చెప్పారని నిర్వాహకులు శివప్రసాద్ తెలిపారు.

'దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి'

గుంటూరు(తూర్పు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజా సుందరంబాబు కోరారు. ఈ విషయమై స్థానిక నార్త్ ప్యారిస్ చర్చిలో ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సుందరంబాబు మాట్లాడుతూ వినతిపత్రంతో పాటు మొత్తం పది వేల మంది సంతకాలు ఉన్న పత్రాన్ని కలిపి జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్‌కి అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు మద్దు ప్రేమ జ్యోతి బాబు, పాస్టర్ సతీష్ బాబు, బిషప్ బాబురావు, ఇద్దా నాయకులు కోరబండ కేజియా వేల్పూరి, రాణి, మేరీ మాత, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ నేత అనారోగ్యం డ్రామా

● జీజీహెచ్ ఐసీయు లో చేరిక

● టీడీపీ నేతల ఆగ్రహంతో డ్రామాకు తెర

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ రోజు టపాసులు కాల్చే విషయంపై దళిత కుటుంబం పై విచక్షణ రహితంగా దాడి చేసి కొట్టిన కేసులో ప్రధాన నిందితుడు కంకర నరేందర్‌రెడ్డి వంకర బుద్ధికి జీజీహెచ్ సూపరింటెండెంట్ మందు వేశారు. జెయిల్ వచ్చేవరకు ఎలాగైనా బయట ఉండాలనే దురుద్దేశంతో నరేందర్ రెడ్డి తనకు మెదడుకు సంబంధించి నరాల సమస్య ఉన్నట్లు చెప్పాడు. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తన బంధువైన వైద్యుడు చక్రం తిప్పి ప్రభుత్వ ఆసుపత్రిలో సదరు వైద్యుడి సహకారంతో నరేంద్రరెడ్డికి న్యూరాలజీ సమస్య ఉన్నట్లు చెప్పి ఆయనను శనివారం ఆర్ఐసీయూలో గుట్టు చప్పుడు కాకుండా చేర్పించారు. అయితే, ఈ విషయం బయటకు రావడంతో టీడీపీ నాయకుడు కనపర్తి శ్రీనివాసరావు వాస్తవ పరిస్థితిపై జీజీహెచ్‌లో వాకబు చేశారు. నరేందర్‌రెడ్డి కేవలం బయట ఉండాలని ఉద్దేశంతోనే వైద్యులను ప్రలోభ పెట్టి ఆసుపత్రిలో చేరినట్లు గుర్తించారు. దీంతో ఆయన వెంటనే జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణను సంప్రదించి నరేందర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై విచారణ జరపాలని కోరారు. విచారించిన సూపరింటెండెంట్ డాక్టర్ రమణ అతని ఆరోగ్య పరిస్థితి సాధారణంగానే ఉందని గుర్తించారు. దీంతో, ఆయనను వెంటనే డిశ్చార్జ్ చేసి ఆదివారం జిల్లా జైలుకు తరలించారు. దీంతో నరేందర్ రెడ్డి అనారోగ్యం డ్రామాకు టీడీపీ నేతలు తెరదించారు.

ఇద్దరు ఆటో డ్రైవర్లు ఆత్మహత్య

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇరువురు ఆటో డ్రైవర్లు ఆర్థిక సమస్యలు పడలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. మూడు రోజుల క్రితం అమరావతి రోడ్ లోని గోరంట్ల సమీపంలోని హోసన్నా మందిరం ప్రాంతానికి చెందిన సంకు రామ్మోహనరావు (51) అప్పుల బాధ తాళలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం మృతి చెందాడు. రామ్మోహనరావుకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో.. నల్లపాడు స్టేషన్ పరిధిలోని మదర్ థెరిస్సా కాలనీకి చెందిన పెద్ది పవన్ కుమార్ (32) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పవన్‌కుమార్ తల్లి నారాయణమ్మ ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నల్లపాడు పోలీసుల అదుపులో గంజాయి ముఠా

స్థానిక నల్లపాడు స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ సమాచారం మేరకు పోలీసులు లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. స్వర్ణభారతీనగర్‌లో ఓ యువతి, మరో యువకుడు లిక్విడ్ గంజాయి విక్రయిస్తున్నట్లు నిఘా వర్గాలకు సమాచారం అందింది. వారి ఇచ్చిన సమాచారంతో పోలీసులు స్వర్ణ భారతీనగర్‌లో దాడి చేసి వారి ఇరువురితోపాటు మరో ముగ్గురు కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారి వద్ద నుంచి సుమారు 37 లిక్విడ్ గంజాయి బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ముఠా కార్యకలాపాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి ప్రణాళికలు: జీఎంసీ కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియాన్ని వాకర్స్, జీఎంసీ అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియంను క్రీడల హబ్ గా, వాకింగ్ చేసుకునే వారికి ఆహ్లాదంగా, సమగ్ర మౌళిక వసతుల కేంద్రంగా తీర్చి దిద్దేందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టేబుల్ టెన్నిస్, షటిల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులను, పురుషుల, మహిళల జిమ్ లను పరిశీలించారు. ప్రతిరోజూ ఆయా క్రీడలు ఆడేందుకు ఎంత మంది వస్తున్నారు, స్టేడియం సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేడియంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, కొన్ని చోట్ల శ్లాబ్ పెచ్చులు ఊడాయని, గోడలు బీటలు బారాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయాలని అన్నారు. జిమ్‌లలో అధునాతన పరికరాల ఏర్పాటుకు, బ్యాడ్మింటన్ గ్రౌండ్‌లో లైట్లు, ఇతర అవసరమైన ఏర్పాట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం టేబుల్ టెన్నిస్ ఆడిన కమిషనర్, అక్కడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు చిన్నారుల ఎంపిక అభినందనీయం

ఎన్టీఆర్ స్టేడియంలో స్కేటింగ్‌లో శిక్షణ పొందిన శ్రీవల్లి, గౌతమ్ విశ్వాస్ లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయనను కలిసిన వారిని ప్రత్యేక అభినందనలు తెలిపారు. శిక్షణ ఇచ్చిన స్కేటింగ్ కోచ్ ఎస్డీ నవారుద్దీన్‌ని ప్రశంసించారు. కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడల శిక్షణకు ప్రత్యేక చర్యలు తీసు కుంటా మన్నారు. వివిధ క్రీడలకు సంబం ధించిన కోర్టుల మరమ్మతులు చేపట్టి, నిపుణులతో శిక్షణ అందిస్తామని తెలిపారు.



ఎన్టీఆర్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ ఆడుతున్న కమిషనర్



శ్రీవల్లి, గౌతమ్ విశ్వాసులను అభినందిస్తున్న కమిషనర్

పారిశ్రామిక అభివృద్ధికి కృషి చేస్తా : డేగల

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారి శ్రామిక అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. కార్పొ రేషన్ చైర్మన్‌గా నియమితుడైన సందర్భంగా ఆదివారం ఆయన కేంద్ర సహాయమంత్రి పెమ్మ సాని చంద్రశేఖర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిరువురూ కొద్ది సేపు ముచ్చ టించుకున్నారు. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించుకున్నారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో పారిశ్రామికరంగం పూర్తిగా దెబ్బతిందని అన్నారు. ఈ పరిస్థితులను మార్చేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తానని, పరిశ్రమలు ఏర్పాటుకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు కార్పొరేషన్ ద్వారా కృషి చేస్తానని చెప్పారు. కేంద్రం నుంచి మంత్రి పెమ్మసాని సహాయం అత్యంత కీలకమని చెప్పారు. దీనిపై కేంద్ర మంత్రి సాను కూలంగా స్పందించారని, కేంద్రం నుంచి నిధులు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు సాధించేందుకు కృషి చేస్తానని పెమ్మసాని హామీ ఇచ్చారని తెలిపారు.



పెమ్మసానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డేగల ప్రభాకర్

మిర్చియార్డు చైర్మన్ పదవిని వడ్డెరలకు కేటాయించాలి

● మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే మాధవికి వినతి

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు చైర్మన్ పదవిని వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వారికి కేటాయించాలని గుంటూరు జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు కోరారు. వడ్డెర నాయకులు ఆదివారం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని కలిశారు. అనంతరం పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవిని కలిసి వినతిపత్రం అందజేశారు. మొదటి నుంచి టీడీపీనే వడ్డెరలు నమ్ముకొని ఉన్నారని చెప్పారు. గతంలో పశ్చిమ టిక్కెట్‌ని వైసీపీ వడ్డెరలకు ఇచ్చినా కులం చూడకుండా టీడీపీ నిలబెట్టిన మద్దాళి గిరినే గెలిపించుకోవడం జరిగిందన్నారు. అలాగే, గత టీడీపీ హయాంలో మిర్చియార్డు వైస్‌చైర్మన్ పదవిని చంద్రగిరి ఏడుకొండలుకు ఇచ్చిందని, అయితే ఆయన పదవి చేపట్టకుండానే చనిపోయారని తెలిపారు. ఈ దఫా యార్డు చైర్మన్ పదవిని వడ్డెరలకు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మల్లె ఈశ్వరరావు, చంద్రగిరి బాబు తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసనలో '108' ఉద్యోగులు

'108' ఉద్యోగుల నిరసన

● సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె

● 25 తర్వాత అత్యవసర సేవలు నిలిపివేస్తాం ● '108' యూనియన్

గుంటూరు(తూర్పు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ '108' ఆదివారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా '108' యూనియన్ గౌరవాధ్యక్షుడు బీ లక్ష్మణరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబు, శివశంకర్ మాట్లాడుతూ '108' సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. అత్యవసర విభాగాల సేవలు నిర్వహిస్తున్న తమకు నెల నెలా వేతనాల కోసం ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, '108' నిర్వహణ సంస్థ అరబిందో సంస్థకు అనేకమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెప్పారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈ నెల 25 తర్వాత అన్ని రకాల అత్యవసర సేవలు నిలిపివేస్తూ నిరవధిక సమ్మెకు దిగేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చ రించారు. నిరసనలలో రామకృష్ణ, ఇందిరమ్మ, మరియమ్మ, యెహోషువ, నాగార్జున, బాజీ, హసన్ కమల్, హరి, సురేంద్ర పాల్గొన్నారు.

నూతన భవన సముదాయానికి రూ.6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ.6 లక్షలను దుర్గి మండలంలోని అడి గొప్పులకి చెందిన మాజీ జెడ్పీటీసీ గుట్లపల్లి మల్లికార్జునరావు విరాళంగా ప్రకటించారు. స్థానిక కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో కేజేఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లకు ఆదివారం ఆయన చెక్కును అందజేశారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ ఆడపిల్లల విద్యకు కృషి చేస్తున్న కమ్మ జన సేవా సమితి సేవలు అభినందనీయమని అన్నారు. వసతి గృహంలో అధి కంగా గురజాల, వినుకొండ, యర్రగొండపాలెంకు చెందిన విద్యార్థులు ఉన్నారని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మరో దాత, ఎన్నారై గాలి మధుబాబు రూ 1 లక్ష విరాళాన్ని అందజే శారు. అనంతరం పాలక వర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆడిటర్ సీ హెచ్ వీరబాబు, ఎం రామ్‌ప్రసాదు, కే రామరావు, ఏ పెద్దబాబు, రామారావు, వీ పూర్ణచంద్రరావు, జీ రాజేంద్ర ప్రసాదు, ఎం బ్రహ్మేశ్వరరావు, కే మోహనరావు, ఎం కృష్ణ, కే శ్రీనివాసరావు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.



సామినేని, చుక్కపల్లి రమేష్‌లకు చెక్కును అందజేస్తున్న గుట్లపల్లి మల్లికార్జునరావు తదితరులు

ప్రతిభావంతుడైన పేద వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం

గుంటూరు(విద్య),నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరానికి చెందిన వైద్య విద్యార్థి ఆరేటి అనిల్ కుమార్‌కు ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. 'మా' స్కాన్ సెంటర్ అధినేత డాక్టర్ ఎం ఆదినారాయణ, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, డాక్టర్ మహేష్, రిటైర్డ్ పోలీస్ అధికారి బాల వెంకటేశ్వరరావు, సామాజిక కార్యకర్త దాసరి తిరుపతి రావులు అనిల్‌కు రూ.65 వేల నగదు సహాయం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదని దాతలు ఇటువంటి ప్రతిభా వంతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అతని తల్లిదండ్రులు రోజువారి కూలీలైనప్పటికీ నీట్ పరీక్షలో అద్భుతమైన ప్రతిభ కనబరచి మెడికల్ సీటు సాధించాడని, విద్యార్థులు అతనిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన అనిల్‌కుమార్ నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి, గన్నవరంలోని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశం పొందాడు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ ఆర్థికసాయంను అందజేశారు.



ఆర్థికసాయం అందిస్తున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వరరావు తదితరులు

పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యేల స్వాగతం

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అమరవీరుల దినోత్స వం సందర్భంగా నివాళుల ర్పించేందుకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మె ల్యేలు మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవిలు ఘనంగా స్వాగతం పలికారు. పవన్ కల్యాణ్‌కు పూలమొక్కలు బహూకరించి, శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖలో ఇప్పటి వరకు 18 మంది అటవీ సిబ్బంది అటవీ సంరక్షణ కోసం ప్రాణాలు అర్పించారని, వారు చేసిన సేవలను గుర్తుచేసుకుని నివాళులర్పించినట్లు చెప్పారు.



పవన్ కల్యాణ్‌కు మొక్కలు అందజేస్తున్న ఎమ్మెల్యేలు మాధవి, నసీర్

కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం టీడీపీలోనే

● జంగా కృష్ణమూర్తిని సన్మానించిన తాడిశెట్టి

గుంటూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం తెలుగుదేశం పార్టీలోనే సాధ్యమవు తుందని టీడీపీ నేత తాడి శెట్టి మురళీమోహన్ అన్నారు. ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడుగా మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణ మూర్తికి స్థానం కల్పిం చడంపై తాడిశెట్టి మురళీ ఆదివారం ఆయన కార్యాలయంలో జంగాకు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ టీడీపీలో అంకిత భావంతో పని చేసే వారికి తప్పక సముచిత న్యాయం జరుగు తుందనేందుకు ఇటీవల విడుదల చేసిన నామినేటెడ్ పోస్టుల జాబితానే ఉదాహరణ అని అన్నారు. జంగా మాట్లాడుతూ సామాజిక న్యాయం చేయడంలో టీడీపీ ముందుంటుందని అన్నారు.



జంగా కృష్ణమూర్తిని శాలువాతో సత్కరిస్తున్న తాడిశెట్టి మురళి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాంబశివరావు, శివప్రసాద్, సత్యనారాయణ, రామబ్రహ్మం, బాలచందర్

'బీయార్ కథలు' పుస్తకావిష్కరణ

గుంటూరు (తూర్పు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం లోని త్యాగరాజ స్వామి కళావేదికలో ఆదివారం ఆచార్య బేతవోలు రామ బ్రహ్మం రచించిన 'బీయార్ కథల పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. అప్పా జోస్యుల విష్ణుబొట్ల కందాళం ఫౌండేషన్, సంస్కృతి సంగీత, నృత్య, సాహిత్య, నాటక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సభకు అజో విభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పా జోస్యుల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి ప్రముఖ సాహితీవేత్త రావెల సాంబశివరావు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామబ్రహ్మంను ఘనంగా సత్కరించారు. ప్రముఖ నాటక రచయిత వల్లూరి శివప్రసాదు గ్రంథ పరిచయం చేశారు. 'సంస్కృతి' నిర్వాహకులు సర్రాజు బాలచందర్, ప్రముఖ రంగస్థల, సినీ నటుడు వైఎస్ కృష్ణేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



'ఓరి వీళ్ళ నటన పాడుగాను'లో ఓ సన్నివేశం

ముగిసిన నాటకోత్సవాలు

గుంటూరు(తూర్పు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కొరిటెపాడు ఎల్‌వీఆర్ క్లబ్ వేదికగా గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి, వై కే నాగేశ్వరరావు కళాపరిషత్ సంయుక్త నిర్వహణలో రెండు రోజుల పాటు జరిగిన నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. రెండో రోజు కార్యక్రమాలను క్లబ్ అధ్యక్షుడు మైనేని బ్రహ్మేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ' బంధం' నాటికను, 'ఓరి వీళ్ళ నటన పాడుగాను' ఆడిషన్స్ స్కిట్‌ను ప్రద ర్శించారు. అనంతరం బొప్పన నరసింహారావు ఆత్మీయ పురస్కారాలను ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు చలసాని కృష్ణ ప్రసాదు, ఎస్‌ఎం భాషా, దేవిరెడ్డి రామకోటేశ్వరరావులకు అందజేశారు. కార్యక్రమాన్ని కళా పరిషత్ సభ్యులు కే రామకృష్ణ, బీ నరసింహారావు పర్యవేక్షించారు.

బాల కళా ప్రభ సాంస్కృతికోత్సవం ప్రారంభం

గుంటూరు(తూర్పు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చిన్నారులలో దాగి ఉన్న సాం స్కృతిక లలిత కళలను ప్రోత్సహిస్తూ నిర్వహిస్తున్న బాల కళా ప్రభ సాంస్కృతికోత్సవ పండుగ ఆదివారం స్థానిక కృష్ణనగర్ లోటస్ ఆద్య పాఠశాలలో ఘనంగా ప్రారంభ మైంది. ఉత్సవాలను బాలానంద కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వందలాది మంది చిన్నారులు హాజరయ్యారు. అనం తరం రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ చదువుతో పాటు జీవన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, ఆత్మ నిర్భరం వంటి అనేక అంశాలలో వారు ఎది గేందుకు బాలానంద కేంద్రం కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎన్ గురుదత్, సహాయ కార్యదర్శి బీ శ్రీనివాస్, కోశాధికారి జీ సంధ్య శ్రీ, వై ఉమా, పీ వెంకటేశ్వరరావు, రుద్ర కళాక్షేత్రం కార్యదర్శి ఎం రాజేష్ పాల్గొన్నారు.

వంట గ్యాస్ ఫుల్ సబ్సిడీ ఎందుకు పడలేదో చెబుతాం

● డీఎస్‌వో కోమలి పద్మ



గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీకి కట్టుబడి టీడీపీ కూటమి ప్రభుత్వం దీపం-2 పథకాన్ని దీపావళి పండగ కానుకగా ప్రారంభించింది. ఏడాదికి మూడు రీఫిల్ సిలిండర్లను పూర్తి ఉచితంగా వంట గ్యాస్ వినియోగదారులకు ఇస్తుంది. అయితే కొన్ని కారణాల వలన ఈ సబ్సిడీ కన్స్యూమర్స్‌కు పడటం లేదు. దానికి కారణాలు ఏమిటో తెలియజేస్తామని జిల్లా సరఫరాల అధికారి(డీఎస్‌వో) కోమలి పద్మ తెలిపారు. ఆమె గ్యాస్ సబ్సిడీ సమస్యలపై 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

జిల్లాలో ఎన్ని ఎల్‌పీజీ(వంటగ్యాస్) కనెక్షన్లు ఉన్నాయి?

డీఎస్‌వో: ప్రస్తుత గుంటూరు జిల్లాలో 7.64 లక్షల వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. రేషన్‌కార్డులు మాత్రం 5 లక్షల 95 వేలు మాత్రమే ఉన్నాయి.

వంట గ్యాస్ ఫుల్ సబ్సిడీకి అర్హతలు ఏమిటి?

డీఎస్‌వో: ఏదైనా ఇంధన సంస్థ నుంచి వంట గ్యాస్ కనెక్షన్, రేషన్‌కార్డు కలిగివుండాలి. ఆధార్ తప్పనిసరిగా లింక్ అయి ఉండాలి. ఈ-కేవైసీ స్టేటస్ యాక్టివ్‌లో ఉంటే సరిపోతుంది.

రేషన్‌కార్డు ఉన్నా ఫుల్ సబ్సిడీ పడలేదని చాలామంది చెబుతున్నారు?



డీఎస్‌వో: ఈ నెల 1 నుంచి డెలివరీ అయిన రీఫిల్ సిలిండర్స్‌కి సబ్సిడీ జమ అవుతోంది. ఫుల్ సబ్సిడీ ఏ కారణంతో పడలేదో చెప్పే సమాచారాన్ని ప్రభుత్వం పంపించింది. దీనిని గ్రామ/వార్డు సచివాలయాలకు పంపిస్తాం. అక్కడకి వెళ్లి ఆధార్/వినియోగదారుడి సంఖ్య చెబితే వాళ్లు చూసి కారణాన్ని చెబుతారు.

ఎక్కువగా ఎలాంటి కారణాలు వెలుగులోకి వస్తున్నాయి?

డీఎస్‌వో: ప్రభుత్వ శాఖల డేటా మొత్తం సేకరించి సింక్రనైజ్ చేయడం జరిగింది. దీని వలన ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా తెల్లరేషన్‌కార్డు కలిగివున్నా వారికి సబ్సిడీ పడదు. అలానే, ఆరు అంచెల మూల్యాంకనం కూడా జరుగుతుంది. ఒక రేషన్‌కార్డులో ఉన్న కుటుంబానికి రెండు, మూడు గ్యాస్ కనెక్షన్లు ఉంటే ఏదో ఒకదానికే సబ్సిడీ నగదు జమ అవుతుంది.



జీటీ రోడ్డుపై నిలిపిన వాహనాలు, పవన్ కోసం ఎదురుచూస్తున్న కార్యకర్తలు

పవన్‌కల్యాణ్‌ని చూసేందుకు భారీగా అభిమానులు

● జీటీ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం

గుంటూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్ రోడ్డులోని అరణ్యభవనానికి ఆదివారం డిప్యూటీ సీం పవన్ కల్యాణ్ రాకతో ఆయనను చూసేందుకు జనసేన కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో వచ్చారు. పవన్ రాకపై ఒక్కసారిగా ప్రచారం జరగడంతో అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జీటీ రోడ్డుకు ఇరువైపులా భారీగా చేరు కున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు పడుతోన్న వాహన చోదకులు మరింత ఇబ్బందులకు గురయ్యారు. రోడ్డుకు ఇరువైపులా భారీగా ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు నిలిపివేశారు. పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం, ఒక్కసారిగా కార్యకర్తలు రోడ్డుపైకి చేరుకోవడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమైంది.

● పవన్ రాకపై గోప్యత

పవన్ కల్యాణ్ రాకపై చివరి వరకు అధికార యం త్రాంగం ఎంతో గోప్యత పాటించింది. అయినప్పటికీ, ముందు రోజు నుంచే ఆయన గుంటూరుకు విచ్చేసే అవకాశం ఉందని సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. శనివారం రాత్రి వరకు పవన్ కార్యక్రమంపై స్పష్టత నివ్వకుండా జాగ్రత్త పడ్డారు, చివరకు మీడియాకు కూడా స్పష్టతనివ్వకుండా గోప్యత పాటించారు. అయినప్పటికీ పవన్ రాకపై ఉదయానికే నగరమంతా వ్యాపించడంతో అభిమానులు, కార్యకర్తల కోలాహలంతో జీటీ రోడ్డు నిండిపోయింది.



క్రీడాకారులతో తులసీ రామచంద్రప్రభు తదితరులు

తులసి సీడ్స్ సౌజన్యంతో కర్రసాము పోటీలు

గుంటూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తులసి సీడ్స్ సౌజన్యంతో ఏన్షియంట్ ఇండియన్ శిలంబమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టీజేపీఎస్ కళాశాలలో సౌత్ ఇండియా స్థాయిలో కర్రసాము పోటీలు ఆదివారం కోలాహలంగా జరిగాయి. ఈ పోటీలను టీజేపీఎస్ కళాశాల కరస్పాం డెంట్ బ్రహ్మం ప్రారంభించారు.ముఖ్య అతిథి తులసీ సంస్థల అధినేత తులసీ రామచంద్రప్రభు మాట్లాడుతూ ప్రాచీన కళ కర్రసాము (సిలంబం) కనుమరుగు కాకూడదనే ఉద్దేశంతోనే దీని ఏర్పాటుకు పూర్తి సహాయ సహ కారాలు అందించామన్నారు. భవిష్యత్‌లో కూడా సహకరిస్తామని అన్నారు. పోటీలు ఆద్యంతం రసవ త్తరంగా జరిగాయి. తులసీ సీడ్స్ ఆధ్వర్యంలో రూ. 2.50 లక్షలతో పోటీలకు పూర్తిగా అవసరమైన క్రీడా సామాగ్రి, మెడల్స్, మొమెంటోస్, టీ షర్ట్స్ 300 మంది క్రీడా కారులకు భోజనం వసతి , అల్పాహార వస తులను ఏర్పాటు చేశారు. పోటీలలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను తులసి రామచంద్ర ప్రభు అందజేశారు. కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసిన కర్రసాము కోచ్ వర్మ, కర్రసాము గ్రాండ్ మాస్టర్ జిడుగు సుబ్బారావుని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ టోర్నమెంట్‌లో ఆంధ్ర, తెలంగాణ, కేరళ, తమిళనాడు నుండి 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉగ్గిరాల సీతారామయ్య, దళవాయి సుబ్రహ్మణ్యం, సిద్ధార్థ వర్మ, సుధీర్, సుమంత్,వర్మ ఉన్నారు.

సందడిగా 'విజ్ఞాన్' పూర్వ ఉపాధ్యాయుల సమ్మేళనం

గుంటూరు(విద్య),నవంబరు 10: ఆనాటి జ్ఞాపకాల నుంచి నేటి కుటుంబ పరిస్థితుల వరకు పలకరింపులతో విజ్ఞాన్ హైస్కూల్‌లో పనిచేసిన పూర్వ ఉపాధ్యాయులు సందడి చేశారు. చేబ్రోలు మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం పూర్వ ఉపాధ్యాయులు తమ కుటుంబ సభ్యులతో కలిశారు. నాలుగు దశాబ్దాల అనంతరం కలిసిన వారంతా సరదాగా, హుషారుగా గడిపారు. ఎవరెక్కడ స్థిరపడ్డారో తెలియజేయడంతో పాటు మిత్రులందరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవ రాయలు మాట్లాడుతూ తనకు స్కూల్‌లో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఇక్కడ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. పురపాలక టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామక్రిష్ణ, సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ కమిషనర్ వీరభద్రరావు, చేబ్రోలు ఎంఈవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమ్మేళనానికి హాజరైన పూర్వ ఉపాధ్యాయులు

విద్యతోనే తొగట వీర క్షత్రియుల అభ్యున్నతి

గుంటూరు(తూర్పు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సామాజిక పరిస్థితులలో విద్యతోనే తొగట వీర క్షత్రియుల అభ్యున్నతి సాధ్యమవుతుందని కుల గురువు దివ్య జ్ఞానానందగిరి స్వామీజీ అన్నారు. స్థానిక రామ క్షేత్రంలో ప్రాంగణంలో ఆదివారం కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వ హించారు.

పాదాల గాయాలను నిర్లక్ష్యం చేయకండి

గుంటూరు మెడికల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మధుమేహ రోగులు తమ పాదాల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని, చిన్న గాయమైనా నిర్లక్ష్యం చేయకుండా చికిత్సలు తీసుకోవాలని ప్రముఖ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ కే రామలింగేశ్వరరావు సూచించారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓలో ఆదివారం మధుమేహ శాస్త్రీయ అవగాహన సభ, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

చిన్నపిల్లల ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల ఆరోగ్యాన్ని పెద్దవాళ్లు అశ్రద్ధ చేయొద్దని పీడియాట్రీషియన్ డాక్టర్ ఆళ్ల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. స్థానిక కేశవ స్మారక సమితి-గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం స్వర్ణాంధ్ర నగర్ (తురకపాలెం రోడ్డు)లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

రుచీ.. శుచీ నేర్పుతారు

ఆహార పదార్థాలను రుచిగా శుచిగా ఎలా వండాలి. అంతే కాదు పదార్థాలల్లోని విలువలు పోకుండా ఎలా వండాలి. అంతేనా వాటిని మార్కెటింగ్ ఎలా చేయాలి.. ఆదాయ వనరుగా ఎలా మలచుకోవాలి.. వంటి అంశాలను నేటి తరానికి నేర్పిస్తూ వారిని తీర్చిదిద్దుతోంది బాపట్లలోని డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ. యువతను వ్యాపార వేత్తలుగా తీర్చి దిద్దే దిశగా పక్కా ప్రణాళికతో ముందుకెళుతోంది. అతి తక్కువ పెట్టుబడితో రుచికరమైన ఆహార పదార్థాలను శుచిగా జనాలకు అందించడం ఎలాగో నేర్పుతుంది. ఈ రోజుల్లో జనాలు ఆరోగ్యానికి ఇస్తున్న ప్రాధాన్యం తెలియని కాదు. అందుకే ఇక్కడ ఆరోగ్య కరమైన ఆహారాన్ని తయారు చేసే విధానంలో కూడా ఈ కళాశాల తర్ఫీదునిస్తోంది. అలాంటి వినూత్నమైన కళాశాల ద్వారా వెలుగులోకి వస్తున్న అభినవ నలభీములపై ఓ లుక్కేద్దామా...

- వినూత్న వంటకాల తయారీలో ఫుడ్ సైన్స్ కళాశాల
- మార్కెటింగ్ మెలకువల్లోనూ శిక్షణ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ పరిధిలో నడుస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ బాపట్లలో 2003లో ప్రారంభమైంది. ఇది ఫుడ్‌సైన్స్‌లో బీటెక్ కోర్సును నాలుగు సంవత్సరాలకు అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్ లోని వివిధ ప్రాంతాలనుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఇక్కడకు ఫుడ్ సైన్స్ కోర్సు అభ్యసించడానికి వస్తారు. మొదటి మూడు సంవత్సరాలు థియరీ తరగతులకు పరిమితమయ్యే బోధన చివరి సంవత్సరంలో మాత్రం ప్రాక్టికల్‌గా వంటలు చేయడం, అమ్మడం వంటి వాటితో గ్రాడ్యుయేషన్ కోర్సును విద్యార్థులు పూర్తి చేస్తారు

కళాశాల అంతా ఘుమఘుమలే....

నాలుగో సంవత్సరం చదువుచున్న ఫుడ్ సైన్సు విద్యార్థులు రకరకాల వంటకాల తయారీలో ఉండడంతో కళాశాల మొత్తం ఆ వాసనలతో ఘుమఘుమలాడుతూ ఉంటోంది. తరగతి గదులన్నీ వంటిల్లులాగా మారిపోవడం, విద్యార్థులు గుంపులుగా ఏర్పడి గరిట తిప్పుతున్న దృశ్యాలు ఆ కళాశాలలో సర్వ సాధారణం. మొత్తం 250 మంది విద్యార్థులకు గాను అమ్మాయిలు 200 వరకు ఉండగా, అబ్బాయిల సంఖ్య 50 వరకు ఉంటుంది

రుచి, శుచి, ఆరోగ్యం....

ఫుడ్ సైన్స్ టెక్నాలజీలో విద్యార్థులకు బోధించేటప్పుడే రుచి, శుచి, ఆరోగ్యంతో పాటు నాణ్యతకు పెద్ద పీట వేసే విధంగా అక్కడ బోధన ఉంటుంది. మొత్తం 6 యూనిట్లుగా విభజించి బోధన జరుగుతుంది. సిరెల్స్, ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్ స్పైసెస్, మీట్, మిల్క్, మిల్లెట్ యూనిట్లుగా వంటల తయారీ ఉంటుంది. ఒక్కో యూనిట్‌కు పదిమంది విద్యార్థులను కేటాయించి వివిధ రకాల ఆహార తయారీలను నేర్పుతారు



తినుబండారాలలో ఉన్న పోషక విలువలను వినియోగదారులకు వివరిస్తున్న విద్యార్థులు

ఒక్కో యూనిట్‌కు 25,000 కేటాయించి..

గ్రూపులుగా విద్యార్థులను విభజించిన తర్వాత వారికి యూనిట్‌లను కేటాయిస్తారు. ఒక్కో గ్రూపుకు పెట్టుబడి కింద 25,000 అందించి నాలుగు నెలల వ్యవధి ఇస్తారు. ఆ మొత్తంతో ముడిసరుకును తెచ్చుకోవడం, ఆహార పదార్థాలు తయారు చేయడం, ప్యాకింగ్, అమ్మకం ఈ ప్రక్రియ అంతా కూడా నాణ్యతా ప్రమాణాలకు లోబడి జరగాల్సి ఉంటుంది. చివరి అంకం అమ్మకాలు కూడా విద్యార్థులే చేయాల్సి ఉంటుంది. పెట్టుబడి కింద ఇచ్చిన 25,000ను పెంచి చూపెట్టి మార్కెటింగ్ నైపుణ్యాన్ని కూడా విద్యార్థులు ఈ ప్రాక్టికల్ శిక్షణలో చూపెట్టాల్సి ఉంటుంది

ఆర్గానిక్ ముడిసరుకు....

విద్యార్థులు తమ ఉత్పత్తులకు కావాల్సిన ముడిసరుకునే నేరుగా రైతుల వద్ద నుంచే కొనుగోలు చేస్తారు. ఎక్కువ శాతం సేంద్రీయంపైనే దృష్టి పెడతారు. పచ్చళ్ల తయారీలో ఫ్రూట్స్, కూరగాయలను పచ్చిగా ఉన్నప్పుడు తెచ్చి సహజ పద్ధతిలో వాటిని నిల్వ ఉంచిన తర్వాతనే పచ్చళ్లను పెడతారు. ఈ క్రమంలో ఆ కూరగాయలు పండించడంలో కెమికల్ శాతాన్ని కూడా శాస్త్రీయ పద్ధతిలో పరిశీలించిన తర్వాతనే ముందుకు వెళతారు



మిల్లెట్స్‌తో తయారు చేసిన తినుబండారాలు

ఆరు యూనిట్లుగా....

సిరెల్స్ యూనిట్ కింద ఇన్‌స్టెంట్ దోశ మిక్స్, స్నాక్ ఐటమ్స్ పూతరేకులు, జంతికలు, చెక్కలను విద్యార్థులు తయారు చేస్తారు. వీటికి కావాల్సిన ముడి పద్దార్థాలన్నింటిని కూడా నేరుగా పొలాల నుంచే సేకరించి వంటకాలు తయారు చేస్తారు. ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్ కింద ఔషధ గుణాలున్న కాకరకాయ పచ్చడి, మునగాకు పచ్చడితో పాటు ఉల్లి కారం, నిమ్మ, మామిడి, ఉసిరి లాంటివన్నీ కూడా తయారు చేస్తారు. మిల్లెట్స్ కింద రాగి పిండి, తృణధాన్యాలతో తయారు చేసిన లడ్డూలు, మిక్స్‌డ్ పొడి వంటివి పూర్తినాణ్యతతో తయారు చేస్తారు. మీట్ యూనిట్ కింద చికెన్, ఫ్రాన్స్ పచ్చడి పోషక విలువలున్న పీతలతో నిల్వ ఉండే విధంగా పచ్చడిని తయారు చేయడం ఈ ఫుడ్ సైన్స్ విద్యార్థుల ప్రత్యేకత. ఇక స్పైసెస్ కింద పసుపు, కారం వాటి వాటిని ముడిసరుకు తెచ్చి విద్యార్థులే స్వయంగా మర ఆడించి ప్యాక్ చేసి అందుబాటులోకి తెస్తారు. పాల పదార్థాలకు సంబంధించి బాదంమిల్క్, పాలకోవాతో పాటు సబ్జా లస్సీ వంటివాటిని నాణ్యతతో తయారు చేసి మార్కెట్‌లోకి తెచ్చే విధంగా వీరి తయారీ విధానం ఉంటుంది.



మిల్క్‌ప్రాడక్ట్స్ తయారీలో విద్యార్థులు



వంట పనుల్లో బిజీబిజీగా



విద్యార్థులు తయారు చేసిన వివిధ రాకాల ఆహార ఉత్పత్తులు

బయటకు....ఈ అభినవ నలభీములకు తేడా...

వ్యాపారంలో లాభాలతో పాటు విలువలు అనే నాణ్యత, ఆరోగ్యం మూల సూత్రం ఆధారంగానే వీరి కోర్సు మొత్తం సాగుతోంది. మారిన అభిరుచుల నేపథ్యంలో మార్కెట్‌లో ధరల గురించి ప్రజలు ఆలోచించడం లేదు. నాణ్యతకు పెద్దపీట వేసి ఆరోగ్యానికి హాని చేయని పదార్థాలను రుచిగా అందించగలిగితే విజయం సాధించినట్లే. వీటిని ఆధారంగా చేసుకనే ఈ కళాశాల విద్యారుథులు ఆయా వంటకాల తయారీలో అనుభవం గడించి ఆ రుచుల ఆస్వాదన కోసం మనల్ని సిద్ధం చేస్తున్నారు

విదేశాలలోనూ అధ్యయనం....

బాపట్లలోని ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలనుంచి ప్రతి ఏడాది పదుల సంఖ్యలో విద్యార్థులను ఇతర దేశాలతోపాటు భారత్‌లోని ఇతర రాష్ట్రాల ఆహార అలవాట్లు, అక్కడ వంటకాల తయారీలో అవలంబిస్తున్న విధానాల పట్ల అవగాహన కల్పిస్తారు. ఇందుకు అయ్యే ఖర్చును యూనివర్సిటీయే భరిస్తుంది. తొలి మూడేళ్ల కోర్సుల్లో భాగంగా డిల్లీ, బెంగళూరు, చెన్నై, యూపీ, గుజరాత్ తదితర ప్రాంతాలకు విద్యార్థులను తీసుకెళ్లి అక్కడ ఆహార తయారీ విధానాలపై అధ్యయనం చేయిస్తారు. చివరి సంవత్సరం విద్యార్థులను మాత్రం తైవాన్, థాయిలాండ్, నెదర్లాండ్ వంటి విదేశాలకు తీసుకెళ్లి అక్కడి వంటకాల తయారీ పరిస్థితులను నేర్చుకునేటట్లు చేస్తారు.

ఈ విద్యార్థులే ఎంటర్ ప్రెన్యూర్‌లుగా....

ఈ కళాశాల నుంచి డిగ్రీ పట్టాతో బయటికెళ్లే విద్యార్థులకు విస్తృత అవకాశాలు ఉండడంతో పాటు సొంతగా ఎంటర్ ప్రెన్యూర్స్‌గా కూడా మారి మరికొంతమందికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగేస్తున్నారు. పలు స్టార్ హోటల్స్‌లో క్యాలిటీ చెకప్ విభాగంలో కానీ, లేదంటే ప్రభుత్వం వైపు నుంచి ఆహార నాణ్యతా ప్రమాణాల విభాగంలో కానీ ఉపాధి లభించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

కన్నుల పండువగా మహారుద్రాభిషేకం

❖ వేలాదిగా తరలివచ్చిన భక్తులు

వినుకొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీకమాసం సందర్భంగా వినుకొండలో శంఖం, ఢమరుకం, ఘంటానాదం, మంగళ ధ్వనులతో అశేష జనవాహిని మధ్య మహాదేవుని మహా రుద్రాభిషేకం, భస్మాభిషేకం నేత్రపర్వంగా ఆదివారం జరిగింది. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో అమ్మ ఛారిటబుల్ ట్రస్టు నిర్వహణలో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సహకారంతో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. అమ్మ ట్రస్టు వ్యవస్థాపకులు జ్ఞానప్రసన్న స్వామిజీ తన శిష్యులతో ఈ మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకలో ఏడు అడుగుల మృత్తికా శివలింగానికి ప్రత్యేకపూజలు చేశారు. శివలింగానికి పసుపు, కుంకుమ, భస్మం, ఫల రసాలు, పలు రకాల పూలు, లక్ష రుద్రాక్షలు, గంధం, సుగంధ ద్రవ్యాలు, జలాలతో మహా రుద్రాభిషేకం కొనసాగింది. అనంతరం శివుడికి హారతి, నైవేద్యం, పట్టాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలి వచ్చిన భక్తులు, హర హర మహా దేవ శంభోశంకర నినాదాలతో జూనియర్ కళాశాల ప్రాంగణం దద్దరిల్లింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడు తూ జ్ఞాన ప్రసూన స్వామిజీ 30 ఏళ్లగా ఎన్నో సేవా కార్యక్రమాలు, ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టడం, అనాధ పిల్లలను చదివించడం వంటి ఎన్నో అమ్మ ఆశ్రమం ద్వారా చేపడుతున్నారని, అందుకు ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. రామలింగేశ్వర స్వామి గుడి అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు ఇచ్చిన సీఎం చంద్రబాబుకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. ఈ సందర్భంగానే ఫిరంగిపురం మండలం వేమవరంలో జ్ఞానప్రసన్న స్వామిజీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కోటిలింగాల ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. తన వంతుగా దేవాలయం నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే జీవీ ఈ సందర్భంగా ప్రకటించారు.



మృతికా శివలింగానికి అభిషేకాలు చేస్తున్న స్వామీజీలు



మహారుద్రాభిషేకం కార్యక్రమానికి హాజరైన భక్తులు

తీరం.. జనసంద్రం

- పోటెత్తిన పర్యాటకులు, భక్తులు
- సెలవుదినం కావడంతో పెరిగిన సందర్శకులు
- వాహనాలతో కిక్కిరిసిన పార్కింగ్ ప్రదేశం
- ముమ్మరంగా పోలీసు బందోబస్తు
- సముద్రంలో గజ ఈతగాళ్ల గస్తీ

"ప్రముఖ పర్యాటక కేంద్రం, సూర్యలంక సముద్ర తీరం ఆదివారం పర్యాటకులు, భక్తులతో జనసంద్రంగా మారింది. కార్తీక పౌర్ణమి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు ఒక వైపు, ఆదివారం సెలవు దినం కావడంలో విచ్చేసిన పర్యాటకులు మరోవైపు సూర్యలంక సాగర తీరాన్ని అటు ఆధ్యాత్మిక భక్తిభావంతో, ఇటు పర్యాటక కోలాహలంతో ముంచెత్తారు. భక్తులు కార్తీకమాస పుణ్యస్నానాలు ఆచరించి, పూజలు నిర్వహించగా, యువత కేరింతలు కొట్టగా, చిన్నారులు ఇసుక తిన్నెలలో ఆటలాడుతూ మునిగి తేలారు."

బాపట్లరూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక సాగర తీరాన్ని ఆదివారం భక్తులు, సందర్శకులు ఆక్రమించారు. ఆదర్శనగర్ నుంచి సూర్యలంక తీరం వరకు వాహనాల రాకపోకలు రద్దీగా మారిపోయింది. తీరం ఒడ్డున పార్కింగ్ ప్రదేశం వాహనాలతో కిక్కిరిసిపోయింది. దూర ప్రాంతాలు నుంచి కుటుంబ సమేతంగా పర్యాటకులు సూర్యలంక తీరానికి చేరుకొని తీరంలో పుణ్య స్నానాలను ఆచరించారు. తీరం ఒడ్డున భక్తులు కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం తీరం సమీపంలోని శ్రీ తారకేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను చేశారు.

యువకులు, చిన్నారులు తీరం ఒడ్డున ఇసుక తిన్నెలతో ఆడుకుంటూ ఉండగా యువకులు తీరంలో అలలకు కేరింతలు కొడుతూ సంతోషంగా గడిపారు. సుమారు 30 వేలకు మంది పైగా పర్యాటకులు రావటం జరిగింది. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు పర్యవేక్షణలో బాపట్ల రూరల్ సీఐ కే.గంగాధరరావు ఆధ్వర్యంలో పర్యాటకులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. గజ ఈతగాళ్ళు సముద్రంలో బోట్లపై తిరుగుతూ పర్యాటకుల ప్రాణ రక్షణ కోసం గస్తీని చేపట్టారు. తీరం ఒడ్డున తాత్కాలిక దుస్తులను మార్చుకునే గదులను పంచాయతీవారు ఏర్పాటు చేయగా స్నానాలు ఆచరించిన అనంతరం భక్తులకు జల్లు స్నానాలను ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తీరం ఒడ్డునే ఏర్పాటు చేశారు. సూర్యలంక తీరంలో స్నానాలు ఆచరించిన అనంతరం ఆదర్శనగర్ సమీపంలోని జీడిమామిడి తోటలు కింద కుటుంబ సమేతంగా కార్తీక వన భోజనాలను చేస్తూ ఆనందంగా గడిపారు.

సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు, భక్తులు



డేటా చౌర్యంపై ఉలిక్కి పడిన పోలీస్ శాఖ

◆ రౌడీషీటర్ బోరుగడ్డ కస్టడీ దృశ్యాలు బహిర్గతంపై సీరియస్ ◆ అరండల్‌పేటస్టేషన్లో టెక్నీషియన్, విలేకరిపై కేసు నమోదు

గుంటూరు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ శాఖకు సంబంధించి అత్యంత రహస్యంగా ఉంచాల్సిన డేటా చౌర్యం కావడంపై పోలీసు శాఖ ఉలిక్కిపడింది. అరండల్‌పేట పోలీస్ స్టేషన్ లోని సీసీ కెమెరాకు సంబంధించిన ఫుటేజ్ బయటకు రావడం పై పోలీస్ స్టేషన్లో కేసు నమోదయింది. ఎస్ఐ రోజాలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్నీషియన్ శేషు, ఓ పత్రికా విలేకరిపై డేటా చౌర్యానికి సంబంధించి కాపీరైట్ యాక్ట్, ఐటి యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ కేసు కు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అరండల్ పేట పోలీస్ స్టేషన్ లోనూ, అదేవిధంగా స్టేషన్ పరిధిలోను గతంలో ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకముందు ప్రైవేట్ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా శేషు అనే వ్యక్తి సీసీ కెమెరాల టెక్నీషియన్‌గా వ్యవహరిస్తున్నారు. సీసీ కెమెరాలు గాని, అదేవిధంగా పోలీస్ స్టేషన్ లోని కంప్యూటర్లు గాని ఏదైనా సాంకేతికపరమైన సమస్య ఎదురైతే శేషుతో రిపేర్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సంబంధించిన పాస్వర్డ్ కూడా శేషు వద్దే ఉంటుంది. ఇదిలా ఉంటే ఇటీవల స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్యపై ఓ పత్రిక విలేకరి పలు వరుస కథనాలు రాయడంతో పోలీసు అధికారులు సదరు విలేకరిపై దృష్టి పెట్టారు. ఆ విలేకరి గతంలో నగరంలో సిటీ బస్సుకు సంబంధించిన ఇరువురు యజమానుల మధ్య తలెత్తిన వివాదంలో జోక్యం చేసుకొని ఒకరి తరుపున పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయించడం, ఈ విషయం ఇరువర్గాల మధ్య వివాదాస్పదమయింది. తాజాగా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్య పై కథనాలు రాసిన నేపథ్యంలో గతంలో జరిగిన వివాదాన్ని బయటకు తీసి ఇటీవల ఆ విలేకరిపై అరండల్ పేట పోలీస్ స్టేషన్ లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేవలం పోలీసులు కక్ష సాధింపు చర్యలో భాగంగా తనపై తప్పుడు ఎస్సీ ఎస్టీ కేసు బనాయించారని భావించిన సదరు విలేకరి తనకు పరిచయం ఉన్న సీసీ కెమెరా టెక్నీషియన్ శేషు ద్వారా ఇటీవల పోలీస్ కస్టడీలో బోరుగడ్డ అనిల్ ఉన్నప్పుడు స్టేషన్ లో చోటు చేసుకున్న పరిణామాలను సీసీ కెమెరా ఫుటేజ్‌ను బయటికి తీయించాడు. అందులో పోలీస్ స్టేషన్లో అనిల్ కుమార్ బల్లపై నిద్రించిన దృశ్యాలకు సంబంధించిన ఫుటేజ్‌ను బయటకు ఇవ్వడంతో అవి సోషల్ మీడియాలో వైరల్ కాగా, అదేవిధంగా మీడియాలోనూ పెద్ద ఎత్తున ప్రసారమయ్యాయి. బోరుగడ్డ వ్యవహారంలో పోలీస్ శాఖలో వరుసగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై ప్రభుత్వం కూడా సీరియస్‌గా ఉండడంతో అరండల్ పేట సీఐ కే శ్రీనివాసరావును విఆర్ కు పంపుతూ ఐజి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సీసీ కెమెరా ఫుటేజ్ ను బయటకు ఇచ్చిన టెక్నీషియన్ శేషును పోలీసులు శనివారం రాత్రే అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విలేకరి అడగడంతోనే తాను ఇచ్చినట్లు శేషు అంగికరించినట్లు తెలిసింది. దీంతో పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో త్వరలోనే ఆ విలేకరిని కూడా అరెస్టు చేసే అవకాశం ఉంది.



నాగార్జున సాగర్ కాలువ

నీటితీరువా వసూళ్ళలో...

గందరగోళం

సత్తెనపల్లి నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వీఆర్వోల పర్యవేక్షణలో జరిగే నీటి తీరువా వసూళ్ళను వైసీపి ప్రభుత్వం రెండు సంవత్సరాల క్రితం గ్రామ సచివాలయాలకు అప్పగించడంతో అరఎకరం భూమికి ఏడాదికి 100 రూపాయలు చెల్లించే రైతు సర్వీస్ చార్జీ రూపంలో మరో 35 రూపాయలు కలిపి 135 రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. చెల్లించడంలో ఆలస్యం అయితే రైతులు కట్టవలసిన నగదుకు 6 శాతం వడ్డీ వేసి సచివాలయంలో వసూళ్లు చేస్తున్నారు. అసైన్డ్ భూములకు నీటితీరువా వసూళ్ళు చేయకపోవడంతో పంట రుణాలు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏట జూన్ ప్రారంభం నుంచి మరుసటి ఏడాది జూలై నెల చివరి వరకూ ఏడాది పాటు నీటి తీరువా వసూళ్ళను ఒక పద్ధతిగా చేస్తుంటారు. ప్రస్తుతం 1432వ ఫసలి నడుస్తున్నది. వరి సాగుకు ఏడాదిలో రెండు పంటలకు సాగునీరు విడుదల చేస్తే ఎకరానికి 350 రూపాయలు నీటితీరువాగా వసూళ్ళు చేస్తారు. ఖరీఫ్ పంటకు మాత్రమే సాగునీరు ఇస్తే ఎకరానికి రెండు వందల రూపాయలు వసూలు చేయాల్సి ఉంది. చేపల చెరువులకు ఏడాదికి ఎకరానికి 500 రూపాయలు వసూలు చేస్తారు. ప్రస్తుతం సచివాలయాల ద్వారా వసూళ్లు చేస్తున్న నీటి తీరువాలో పలు ఇబ్బందులున్నాయి. రైతుకు 4ఎకరాల భూమి ఉంటే సాంకేతిక తప్పిదాల కారణంగా 3 ఎకరాలు మాత్రమే అడంగళ్‌లో చూపుతుంది. నీటి తీరువా చెల్లించే సమయంలో ఈ 3 ఎకరాలకే శిస్తు కట్టించుకుంటున్నారు. దీంతో ఎకరం భూమి తన పేరున ఉన్నా ఆన్‌లైన్‌లో కనిపించక పోవడంతో నీటి తీరువా చెల్లించేందుకు రైతులకు అవకాశం లేకుండా పోయింది. గతంలో అసైన్డ్, పోరంబోకు భూములకు కూడా వీఆర్వోలు నీటి తీరువా వసూలు చేసేవారు. రసీదులు కూడా ఇచ్చే వారు. ప్రస్తుతం పట్టా భూములు, అవి కూడా అడంగళ్‌లో నమోదై ఉన్న భూములకు మినహా ఇతర కేటగిరిలో ఉన్న భూములకు నీటి తీరువా వసూళ్ళను రెండేళ్ళుగా నిలిపి వేశారు. నీటి తీరువా ప్రతి ఏటా కడితే భూమి తమదేననే ధైర్యం రైతులకు ఉంటుంది. అసైన్డ్, ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్న చిన్న పాటి రైతుల నుంచి నీటితీరువా కట్టించుకోక పోవడంతో సహకార సంఘాలు, వాణిజ్య బ్యాంకులలో రైతులకు పంట రుణాలివ్వడం లేదు. రైతులు రుణాల కోసం స్థానిక వడ్డీ వ్యాపారులపై ఆధారపడవలసి వస్తుంది. రైతుల ఇబ్బందులను గుర్తించి కూటమి ప్రభుత్వం అసైన్డ్ భూములకు నీటితీరువా కట్టించుకునేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.



పత్తిపంట

పశ్చిమ డెల్టాకాల్వకు 6830 క్యూసెక్కులు

దుగ్గిరాల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుం చి పశ్చిమ డెల్టా కాల్వకు 6830 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 316 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 1711 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 682 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 187 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 387 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 3060 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలకు ఈఆర్‌వో సందర్శన



పోలింగ్‌కేంద్రంలో బీఎల్‌వోతో మాట్లాడుతున్న ఈఆర్‌వో లక్ష్మికుమారి, తహసీల్దార్ సునీత

దుగ్గిరాల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి లక్ష్మి ఆదివారం సందర్శించారు. గ్రామంలోని వీబీఎం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, పెదపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలతోపాటు పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కొత్తగా అందిన దరఖాస్తులను తనిఖీ చేసి, పెండింగ్ ఎన్ని ఉన్నాయనే అంశాలను తహసీల్దార్, వీఆర్‌వో, పోలింగ్ అధికారులతో చర్చించారు. చిలువూరు, తుమ్మపూడి, పెదపాలెం, వీర్లపాలెం, కేఆర్‌కొండూరు తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు వివేకానంద, వెంకట్రావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా
సవరణ క్యాంపుల పరిశీలన

మంగళగిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితా -2025 సవరణ క్యాంపులు శని, ఆదివారాల్లో జరిగాయి. బీఎల్వోలు సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలకు అందుబాటులో ఉండి విజ్ఞప్తులను స్వీకరించారు. మంగళగిరి, దుగ్గిరాల ప్రాంతాల్లో జరుగుతున్న క్యాంపులను నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఏ లక్ష్మీకుమారి ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న సిద్ధాంతి రాఘవ

వట్టిచెరుకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరు గ్రామంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, ఆలయ విగ్రహాల స్థాపన, కుంభాభిషేక మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో గ్రామస్థులు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రవేశం, విగ్రహాల ప్రతిష్ఠాపన, కుంభాభిషేకాన్ని వేద పండితులు సిద్ధాంతి రాఘవ నిర్దేశించిన సమయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎస్సీ వర్గీకరణపై వైసీపీ వైఖరి చెప్పాలి

● డొక్కా మాణిక్యవరప్రసాద్



రామారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాణిక్యవరప్రసాద్

మంగళగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై వైసీపీ వైఖరి చెప్పాలని మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ డిమాండ్ చేశారు. దుగ్గిరాల మండలం చిలువూరులో ఎమ్మార్పీఎస్ నేత ఇందుపల్లి రామారావు సంస్మరణ సభ ఆదివారం జరిగింది. నేతలు రామారావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో రామారావు కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణను అంగీకరించి అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. మాల, మాదిగలు సోదరభావంతో మెలిగి తమకు రావలసిన హక్కులు, రిజర్వేషన్ల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు కట్టెపోగు ఉదయభాస్కర్, అత్తోట జోసెఫ్‌కుమార్, ఇందుపల్లి జయరావు, కారుమంచి రామారావు, ప్రత్తిపాటి నవజీవన్, సుబ్బారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాడిన నేత ఆశీర్వాదంకు నివాళి

తాడేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల సమస్యలపై పని చేసిన నాయకులు చొక్కా ఆశీర్వాదమని సీపీఎం మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరులో జరిగిన స్వర్గీయ చొక్కా ఆశీర్వాదం వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ పార్టీపై నిబద్ధతతో నిజాయితీతో ఆశీర్వాదం వ్యవహరించేవారని గ్రామంలో సర్పంచ్‌గా పనిచేసి పేదల, ఇసుక క్వారీ కార్మికుల పక్షాన నిలబడి అండగా నిలిచారన్నారు. గ్రామాభివృద్ధి కోసం శ్రమించిన సీపీఎం మాజీ సర్పంచ్ దోకిపర్తి చలపతిరావుతో కలిసి సమస్యలపై పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నేత జొన్నా శివశంకర్, పల్లె కృష్ణ, దోకిపర్తి కోటయ్య, దాసరి సురేష్, బర్నబాస్, డేవిడ్, దావీదు పాల్గొన్నారు.

విధులకు మంగళం

● సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది
● మధ్యాహ్నం 3.30గంటలకే సచివాలయం ఖాళీ
● ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం



మధ్యాహ్నం 3.30లకే సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు (ఫైల్ ఫొటో)

పెదనందిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగుల్లో విధుల్లో అంతులేని నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. ఇంకా పాత ప్రభుత్వ వాసన వారిని వీడడం లేదు విధులకు ఎప్పుడు హాజరవుతారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి కనిపిస్తుంది. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉండి ప్రజలకు సేవలందిచాల్సి ఉంటుంది. కానీ పెదనందిపాడులో గ్రామ సచివాలయ-1 సిబ్బంది మధ్యాహ్నం 3.30గం.లకే సచివాలయం విధులకు మంగళం పాడేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన మండల స్థాయి అధికారులు అసలు సచివాలయాల ఊసే మర్చిపోవడంతో గ్రామస్థాయి సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంది. సచివాలయంలో 8శాఖల అధికారులు ఉండాల్సి ఉండగా ఏ ఒక్క అధికారి లేకపోవడంతో వివిధ పనులపై వచ్చిన ప్రజలు వెనుతిరిగి వెళ్తున్నారు. ఇలా ప్రజాసమస్యల పరిష్కారం ఎలా సాధ్యమయ్యేనంటూ ప్రజలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సచివాలయాల తీరు కూడా ఇలానే ఉందని ప్రజలు పేర్కొంటున్నారు.

భూ సేకరణ వద్దు.. భూ సమీకరణకే మొగ్గు

● గ్రామసభలో రైతుల ఏకగ్రీవ తీర్మానం
● అభివృద్ధికి ఎప్పుడూ సహకరిస్తాం



తాడికొండ పంచాయతీ గ్రామసభలో మాట్లాడుతున్న హనుమంతరావు

తాడికొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నూతనంగా చేపడుతున్న రైల్వే లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు భూసేకరణ వద్దని.. భూ సమీకరణకే మొగ్గు చూపుతున్నట్లు తాడికొండ గ్రామ రైతులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఆదివారం సాయంత్రం తాడికొండ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు ఎడ్డూరి హనుమంతరావు మాట్లాడుతూ రాజధాని అమరావతి నిర్మాణానికి రైతులు ఏ విధంగా అయితే భూములు త్యాగాలు చేశారో అదేవిధంగా రైల్వే లైన్, ఇన్నర్‌రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు కావాల్సిన భూములను రైతుల నుంచి సమీకరణ చేసి తీసుకోవాలని కోరారు. ఇప్పటికే కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌ల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అభివృద్ధికి రైతులు అడ్డుకాదని, కానీ రైతులు నష్టపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని.. అభ్యంతరాలను ఈనెల 19వ తేదీ లోపు తెలియజేయాలని కోరిందన్నారు. భూములు కోల్పోయే రైతులందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. భూ సేకరణ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని, భూమి సాగుచేసే సన్న, చిన్న కారు రైతులు చాలా మంది ఉన్నారని తెలిపారు. అభివృద్ధికి రైతులు ఏమాత్రం వ్యతిరేకం కాదని, ప్రభుత్వాలకు సహకరిస్తామని తెలిపారు. రాజధాని నిర్మాణానికి ఏవిధంగా అయితే భూములను సమీకరించి రైతులు నుంచి తీసుకున్నారో అదేవిధంగా రైల్వేలైన్, ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మాణాల కోసం భూ సమీకరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామసభలో రైతులు భూ సమీకరణకు మద్దతు తెలియజేశారు. త్వరలోనే ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తోకల సరోజిని, సెక్రటరి హరిబాబు, వార్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో సమయపాలన, క్రమశిక్షణ ముఖ్యం

● ఐఈఈఈ విద్యార్థి విభాగంలో ఏర్పాటు
● గుంటూరు సబ్‌జంక్షన్ చైర్‌పర్సన్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి



కళాశాల సబ్‌జంక్షన్ విభాగ సభ్యులతో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఉషారాణి

వట్టిచెరుకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ప్రతి ఒక్కరిలో సమయపాలన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు ముఖ్యంగా గుర్తించాలని గుంటూరు సబ్‌జంక్షన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఈదర శ్రీనివాస రెడ్డి, డాక్టర్ కే ఉషారాణిలు సూచించారు. మండల పరిధిలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈదర శ్రీనివాసరెడ్డి, కే ఉషారాణిలు హాజరై విద్యార్థులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. నూతనంగా ఏర్పడిన విద్యార్థి విభాగం ద్వారా ప్రపంచ స్థాయిలో ఉత్తమ ప్రమాణాలున్న వ్యక్తులతో పరిచయాలు, వారి ద్వారా ఉపయోగాలను వివరించారు. విద్యార్థి దశలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్ళు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో గెలవాలంటే నైపుణ్యంతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలన్నారు. నూతనంగా ఏర్పాటైన ఐఈఈఈ విద్యార్థి విభాగాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గుంటూరు, అమరావతి, సబ్‌జంక్షన్ పరిధిలో ప్రారంభించిన విద్యార్థి విభాగానికి ఈసీఈ విభాగాధిపతి విజయసారధి కౌన్సిలర్‌గా, కళాశాల విభాగం ప్రెసిడెంట్‌గా చిత్తంశెట్టి అలేఖ్యను ప్రకటించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జంపని కిషోర్ బాబు, అధ్యాపకులు, విద్యార్థు లు పాల్గొన్నారు.

సుందరయ్యనగర్‌లో ప్రజాపోరు యాత్ర ప్రారంభం



ప్రజాపోరులో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణయ్య

తాడేపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం సుందరయ్య నగర్‌లో ఆదివారం ప్రజాపోరు ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వీ కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలని సర్దుబాటు పేరుతో కరెంటు చార్జీల బాదుడు ఉపసంహరించుకోవాలని, ఉచిత ఇసుక పాలసీ అమల్లోకి తేవాలని, నదిలో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ముగ్గురోడ్డు నెహ్రూబొమ్మ సెంటర్లో జరిగిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ, వైసీపీ ప్రభుత్వ విధానాల్లో తేడాలు ఏమీ లేవని ఆయన అన్నారు. ఆయా కార్యక్రమాల్లో కొట్టే కరుణాకర్, గడ్డన్న, గిరిజ, భుజంగరావు, రామారావు, జ్యోతి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో..

తాడేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలో ప్రజాపోరు జాతాను సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ట్రూ అప్ చార్జీలు ఉపసంహరించుకోవాలని నవంబరు 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ ఉండవల్లి పెను మాకలో యూ-1 జోన్ ఎత్తివేయాలని అన్నారు. ఉండవల్లి పెనుమాకలో జరిగిన ఈ ప్రజాపోరు కార్యక్రమంలో శాంతి, శ్రీనివాసకుమార్, వల్లభాపురం వెంకటేశ్వరరావు, బక్కిరెడ్డి, భాగ్యరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

చినకాకానిలో..

మంగళగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారం మోపడమే లక్ష్యంగా పనిచేస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈమని అప్పారావు విమర్శించారు. ప్రజాపోరులో భాగంగా మంగళగిరి మండలం చినకాకానిలో ఆదివారం పాలక ప్రభుత్వాల వైఫల్యాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జెమిలి ఎన్నికల విధానం తీసుకువచ్చి రాష్ట్రాల హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం చినకాకాని కార్యదర్శి జీ బాబువర ప్రసాద్, కాజ శివశంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'108' ఉద్యోగుల నిరసన

● సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె
● 25 తర్వాత అత్యవసర సేవలు నిలిపివేస్తాం
● యూనియన్ గౌరవాధ్యక్షుడు లక్ష్మణరావు



కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసనల్లో పాల్గొన్న 108 ఉద్యోగులు

గుంటూరు(తూర్పు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ '108' ఆదివారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా '108' యూనియన్ గౌరవాధ్యక్షుడు బీ లక్ష్మణరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబు, శివశంకర్ మాట్లాడుతూ '108' సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. అత్యవసర విభాగాల సేవలు నిర్వహిస్తున్న తమకు నెల నెలా వేతనాల కోసం ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, '108' నిర్వహణ సంస్థ అరబిందో సంస్థకు అనేకమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెప్పారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈ నెల 25 తర్వాత అన్ని రకాల అత్యవసర సేవలు నిలిపివేస్తూ నిరవధిక సమ్మెకు దిగేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. నిరసనలో రామకృష్ణ, ఇందిరమ్మ, మరియమ్మ, యెహోషువ, నాగార్జున, బాజీ, హసన్ కమల్, హరి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజా సుందరంబాబు కోరారు. ఈ విషయమై స్థానిక నార్త్ ప్యారిస్ చర్చిలో ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సుందరంబాబు మాట్లాడుతూ వినతిపత్రంతో పాటు పది వేల మంది సంతకాలు ఉన్న పత్రాన్ని కలిపి జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్‌కి అందజేయనున్నట్లు తెలిపారు.

యోగాతోనే ఆరోగ్యం

పెదనందిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని సర్దార్ వల్లభాయ్‌పటేల్ అకాడమీ యోగా శిక్షకుడు కే నాగమల్లేశ్వరరావు అన్నారు. మండలపరిధిలోని నాగభైరువారిపాలెంలో ఆదివారం యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందని.. కనీసం రోజులో గంట వ్యాయామం చేయాలని, ఆహార నియమాలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దండా శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘ ఎన్నికల జాబితా విడుదల

వట్టిచెరుకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నీటి సంఘాల ఎన్నికల జాబితాను ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో తహసీల్దార్ నగేష్, డీటీ దరియావలి ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. నీటి సంఘాలకు జరగనున్న ఎన్నికల దృష్ట్యా గ్రామాల వారీ నీటి సంఘ సభ్యుల జాబితాలను సోమవారం ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్ద ప్రకటిస్తారని తహసీల్దార్ నగేష్ వెల్లడించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కే విజయ కుమార్, ఇన్‌చార్జ్ ఆర్‌ఐ ఆదినారాయణ పాల్గొన్నారు.

పత్తి పంట నాశనంపై కేసు

తుళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పత్తి పంట నాశనం చేసిన దానిపై తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం పెదపరిమి గ్రామానికి చెందిన పుట్టి తిరుపతమ్మకు పూర్వీకుల నుంచి సంక్రమించిన 1.86సెంట్ల భూమి ఉంది. ఆ భూమిలో పత్తి పంట వేసింది. ఈనెల 7వ తేదీన ఆమె మరిది పుట్టి హనుమంతురావు పొలాన్ని దున్ని పంట నాశనం చేసినట్టు తిరుపతమ్మ ఫిర్యాదులో తెలిపింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గంగా వెంకటేశ్వరరావు తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలపై రాజకీయంగా పోరాడుదాం

● వైసీపీ సమన్వయకర్త వేమారెడ్డి

మంగళగిరి సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్య కరమైన పోస్టులు కాకుండా కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై రాజకీయపరంగా పోరాడాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైసీపీ తాడేపల్లి మండల నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం మంగళగిరి బైపాస్ రోడ్డులోని నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం జరిగింది. వేమారెడ్డి మాట్లాడుతూ అక్రమ కేసులకు వైసీపీ కార్యకర్తలు భయపడాల్సిన అవసరంలేదని, పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావులు ప్రసంగించారు. ఈ సమావేశంలో తాడేపల్లి మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

● వాహనాన్ని అడ్డగించిన గ్రామస్థులు
● పోలీస్‌స్టేషన్‌కు తరలింపు

పెదనందిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా చీకట్లో తరలిద్దామనుకున్న రేషన్ బియ్యాన్ని గ్రామస్థులు గుర్తించారు. అడ్డదారిలో రేషన్ బియ్యాన్ని తీసుకెళుతున్న ఆటోను గ్రామస్థులు అడ్డగించి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే మండలపరిధిలోని రావిపాడులో స్థానికులు సాయంత్రం వేళలో పిచ్చాపాటి మాట్లాడుకుంటూ రోడ్డుపై కూర్చుని ఉండగా అదే సమయంలో వంగిపురం వైపు నుంచి రేషన్ బియ్యంతో వస్తున్న వాహనాన్ని గ్రామస్థులు గుర్తించారు. అందులో తరలిస్తున్నది రేషన్ బియ్యం అనే అనుమానంతో ఆటోను అడ్డగించారు. ఈ క్రమంలో ఆటో డ్రైవర్ బూటకపు మాటలతో బుకాయించి అక్కడినుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఈలోపు సమాచారం అందుకున్న అక్రమ రేషన్ బియ్యం వాటాదారులు అక్కడికి చేరుకొని గ్రామస్థులతో గొడవకు దిగారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని రేషన్ వాహనాన్ని పోలీసులు పోలీసుస్టేషన్‌కు తరలించారు.

విద్యతోనే తొగట వీర క్షత్రియుల అభ్యున్నతి

గుంటూరు(తూర్పు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో విద్యతోనే తొగట వీర క్షత్రియుల అభ్యున్నతి సాధ్యమవుతుందని కుల గురువు దివ్య జ్ఞానానంద గిరి స్వామీజీ అన్నారు. స్థానిక రామ క్షేత్రంలో ప్రాంగణంలో ఆదివారం తొగటవీర క్షత్రియుల కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

● ఎస్ఐ అద్దంకి మధుపవన్

ఫటా ఫట్



పెదనందిపాడు నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్ఐ అద్దంకి మధుపవన్ తెలిపారు. ఆయన పలు అంశాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

ప్ర: చోరీల నియంత్రణపై దృష్టి సారిస్తున్నారా?

జ: గ్రామాల్లో చోరీలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ.. చోరీలపై కేసులను నమోదు చేసి పాతనేరస్థులను విచారిస్తూ కేసుల దర్యాప్తును వేగవంతం చేస్తున్నాం.

ప్ర: ట్రాఫిక్ సమస్యలపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ: పాతబస్టాండ్ సెంటర్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 3 నుంచి 6 గంటల సమయంలో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నాం.

ప్ర: సమస్యాత్మక గ్రామాలపై ఎలాంటి నిఘా ఏర్పాటు చేశారు?

జ: సమస్యాత్మక గ్రామాల్లో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా వెంటనే సమాచారం తెలుసుకొని అల్లర్లు జరగకుండా చర్యలు చేపడుతున్నాం.

ప్ర: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ: గుంటూరు-పర్చూరు రహదారిలో మూలమలుపు వద్ద ప్రమాదాల నివారణకు ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. పాఠశాలల ఎదుట, రద్దీగా ఉండే ప్రాంతాల్లో స్పీడు బ్రేకర్లతో పాటు ట్రాఫిక్ నియమాల బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం

ప్ర: మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్నారా?

జ: ఆయా కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు, యువతకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం.

సీఎం చంద్రబాబును కలిసిన ఆళ్ళ వెంకట్



సీఎం చంద్రబాబును కలిసిన ఎన్నారై టీడీపీ లాస్ ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ళ వెంకట్

పెదనందిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఎన్నారై, టీడీపీ లాస్ ఏంజెల్స్ అధ్యక్షుడు ఆళ్ళ వెంకట్ ఆదివారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలపై, గుంటూరు ఛానెల్ పొడిగింపు చేపట్టాలని, నల్లమడ డ్రెయిన్ల ఆధునీకీకరణ జరపకపోవడంతో వరదలు వచ్చి పంట పొలాలు నీటమునిగి ఈ ప్రాంత రైతులు తీవ్ర నష్టపోతున్నారని సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి ఎన్నారైల సంఘం నుంచి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

ఉత్సాహంగా కరాటే చాంపియన్‌షిప్ పోటీలు



కరాటే పోటీల్లో తలపడుతున్న చిన్నారులు

మంగళగిరి సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జపాన్ సిటోరియో కరాటే ఏపీ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరి ఈద్గా షాదీఖానా మైదానంలో 9వ జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి దాదాపు 600 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత ఏపీ చీఫ్ మాస్టర్, అడిషనల్ ఎస్పీ వి.గణేష్‌బాబు పోటీలను ప్రారంభించారు. ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరాటే చాంపియన్‌షిప్ ఆర్గనైజర్ దొడ్డాకుల ప్రభాకర్, టీడీపీ నేతలు గోవాడ దుర్గారావు, వాకా మాధవరావు, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పర్వతం మధుసూదనరావు, కరాటే మాస్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


వైభవంగా కోటివత్తుల దీపోత్సవం



దుగ్గిరాల శివాలయంలో శివలింగాకారంలో వెలిగించిన కోటివత్తుల దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

దుగ్గిరాల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శ్రీగంగాపార్వతీ సమేత శ్రీనాగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక కోటి దీపోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం శివాలయంలో పుష్పాలతో అలంకరించిన శివలింగాకారంలో దీపాలను కనువిందుగా ఏర్పాటు చేసి కోటివత్తులను మహిళలు భక్తిశ్రద్ధలతో వెలిగించారు. ఆలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన షెడ్డులో కొత్తగా దీపస్థాండుపై ప్రమిదలను ఏర్పాటు చేసి నిర్వహించిన కోటివత్తుల దీపోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకుడు నాగేశ్వరం యుగంధర్‌శర్మ నేతృత్వంలో కొలగాని రాధాకృష్ణ దంపతులు వినాయకపూజ నిర్వహించారు. అనంతరం భక్తులు దీపాలను వెలిగించారు. తదుపరి భక్తులకు పలురకాల తీర్థ ప్రసాదాలను అందించారు.

కొనసాగుతున్న ఏసీసీ కార్మికుల దీక్షాశిబిరం



దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు, స్థానికులు

తాడేపల్లి టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తమకు న్యాయంగా రావలసిన నష్టపరిహారం కోసం ఏసీసీ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న 12వ రోజు దీక్షా శిబిరంలో ఆదివారం పెద్ద సంఖ్యలో కార్మికులు, స్థానికులు పాల్గొన్నారు. యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా నిలబడి తమ హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి నారా లోకేశ్ జోక్యం చేసుకొని ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కూరపాటి స్టీవెన్, కే ఆదినారాయణ, బూరుగ వెంకటేశ్వర్లు, అంకయ్య, ఆశీర్వాదం, సూరి, సాంబయ్య, నవనీతం, నాగేశ్వరరావు, శ్రీరాములు, పాల్గొన్నారు.

గ్రామాల్లో చురుకుగా టీడీపీ సభ్యత్వ నమోదు

పొన్నూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ములుకుదురు, ఆలూరు, తాళ్ల పాలెంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు మండల టీడీపీ అధ్యక్షుడు బి.బాబురావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎం.వెంకటేశ్వరరావు, సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు, సి.సీతరామయ్య తదితరులు సభ్యత్వ నమోదును పరిశీలించారు.

పాఠశాలల్లో ఆట స్థలాల అభివృద్ధికి కొరవడిన ప్రణాళిక

● పీఎంశ్రీ పథకంలో రూ.5లక్షలు మంజూరు

● ఎర్రమట్టి అందుబాటులో లేక అవస్థలు



తెనాలి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలలో ఆట స్థలాల అభివృద్ధికి తగిన ప్రణాళికలు రూపొందించుకోకపోవడంతో కేటాయించిన నిధులు ఎలా ఖర్చు చేయాలనే అంశంపై మీమాంశ నెలకొంది. క్రీడలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా పేరిట మండలానికి ఒక పాఠశాలకు రూ.5లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రౌండ్‌ను అభివృద్ధి చేసి మూడు కోర్టులు నిర్మించాలి. అయితే రూ.5లక్షలతో ఏం చేయాలి ఎలా చేయాలి అనేది అధికారులు నిర్దేశించకపోవడంతో మండలానికి ఒక విధంగా ఆటస్థల అభివృద్ధికి విధానాలు అమలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు ఈ నిధుల వినియోగంను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే మొదటి విడత క్రింద రూ.1లక్షతో కొంత పనిచేశారు. మరో విడత నిధులు రూ.1లక్ష విడుదలయ్యాయి. అయితే పాఠశాలల ఆట స్థలం ప్రస్తుతం ఎలా ఉంది, ఎలా అభివృద్ధి చేయాలి, యేయే అవసరాలు ఉన్నాయి అనే అంశాలను గుర్తించకుండా అధికారులు ఒంటెద్దు పోకడపోతున్నారు. ఆట స్థలం మెరక వేస్తేనే కానీ కోర్టులు వేసేందుకు అవకాశం ఉండదు. దశల వారీగా ఆట స్థలం అభివృద్ధి, ఆటస్థలం మెరక, కోర్టులు ఏర్పాటు వంటివి అంశాలను గుర్తించాల్సి ఉంది. పలుచోట్ల పాఠశాలలో ఆట స్థలంలో పిచ్చిమొక్కలు, తుంగ, గరిక, ముళ్ళ చెట్లు పెరిగిపోయి ఉండటంతో పాటు ఎత్తుపల్లాలతో వర్షా కాలంలో నీరు నిలబడిపోతోంది. వీటన్నిటిని గుర్తించి ఆటస్థల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఎక్కడా కూడా అలాంటి పనులు చేపట్టడం లేదని విమర్శలున్నాయి.

ఎర్రమట్టే కావాలట...

ఆట స్థలాల అభివృద్ధి చేసే విషయంలో కోర్టులకు ఎర్రమట్టిని మాత్రమే వినియోగించాలనే సర్వశిక్ష అభియాన్ అధికారులు పట్టుబడుతున్నారు. వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో ఆటలకు మూడు కోర్టులను ఈ మట్టితో ఏర్పాటు చేయాలని చెబుతున్నారు. కానీ ఈ ఎర్రమట్టి గన్నవరం దగ్గర మాత్రమే లభిస్తోంది. రూ.1లక్ష పెడితే మూడు లారీలు కూడా వచ్చే పరిస్థితి లేదు. దీనికి తోడు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో ఆటస్థలాల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నచందాన మారింది. ఆటస్థలం ఎత్తుపల్లాలు సరిచేయకుండా ఏకంగా కోర్టులు ఏర్పాటుచేసి ఎర్రమట్టి పరచాలని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని వ్యాయామ ఉపాధ్యాయులు వాపోతున్నారు. వేజండ్ల క్వారీలో లభించే గ్రావెల్ వినియోగానికి అడ్డుచెబుతూ వస్తున్నారు. తక్కువ ధరలో ఎక్కువ గ్రావెల్ వస్తుందని ఆటస్థల మెరకకు ఉపయోగపడుతుందని అధికారులకు చెబుతున్నా కూడా వినే పరిస్థితి కనబడటం లేదు. ఈ గ్రావెల్ కూడా రవాణా చేసేందుకు ప్రభుత్వ అనుమతులు లేకపోవడంతో ఆట స్థలాల అభివృద్ధి నిలిచిపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆట స్థలాల అభివృద్ధిని అవసరానికి అనుగుణంగా గుర్తించి చేపట్టాలని గ్రావెల్ రవాణాకు అనుమతులు ఇవ్వాలని ఆట స్థలాలు క్రీడలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని పలువురు సూచిస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో కుక్కల దాడి

● ఆదివారం పదుల సంఖ్యలో పలువురికి కాట్లు

● ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయించిన బాధితులు

● కుక్కల బెడద నివారణకు బాధితుల డిమాండ్

తెనాలి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుక్కలు దాడిచేయడంతో గాయాలపాలై తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలను ఆశ్రయించే బాధితుల సంఖ్య నానాటికి పెరిగిపోతోంది. ఆదివారం ఒక్కరోజే వివిధ ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో గాయపడి వైద్యశాలను ఆశ్రయించారు. అందులో మూడేళ్ల చిన్నారికి మోకాళ్లపై భాగంలో వీధికుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ఆ పాపకు వైద్యం అందించేందుకు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తల్లిదండ్రులు తీసుకువచ్చారు. పాప బాధను చూసి తల్లిదండ్రులు తల్లడిల్లుతున్న తీరు చూపరులను ఆవేదనకు గురిచేసింది. అదేవిధంగా తెనాలి గంగానమ్మపేటకు చెందిన నలుగురు, యడ్లలింగయ్య కాలనీలో ఒకరు, కఠెవరం గ్రామానికి చెందిన ఇద్దరు, చేబ్రోలు, వేమూరు నియోజవర్గాల నుంచి పలువురు కుక్కకాటుతో వైద్యశాలను ఆశ్రయించారు. వైద్యులు వారికి యాంటీ రాబీస్ ఇంజక్షన్‌ను అందించి చికిత్స అందిస్తున్నారు. గతంలో ఆంధ్రజ్యోతి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వీధికుక్కల దాడికేసులు పెరుగుతున్నాయని తక్షణ చర్యలు చేపట్టాలని లేకుంటే కేసులు పెరిగే ప్రమాదం ఉందని అధికార యంత్రాంగాన్ని హెచ్చరించింది. అయినా వారిలో కదలిక రాకడంతో వాటి దాడిలో గాయపడి ఆసుపత్రులపాలవుతున్న బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు వాటి నివారణకు చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలవాలని పలువురు కోరుతున్నారు.



కుక్కకాటుతో గాయపడి చికిత్స పొందుతున్న చిన్నారితో తల్లిదండ్రులు

ప్రభుత్వానికి మంచిపేరు తేవడమే లక్ష్యం

● తహసీల్దార్ గోపాలకృష్ణ

ఫటా ఫట్



తెనాలి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూ వివాదాలకు తావులేకుండా రైతులకు మేలు జరిగేలాచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తేవడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ ఆంధ్రజ్యోతితో చెప్పారు.

ప్రశ్న: ఎటువంటి సమస్యలు రైతులు మీ దృష్టికి తీసుకువస్తున్నారు?

జవాబు: ఆన్‌లైన్ రికార్డులో తమ భూమి వివరాలు పూర్తిస్థాయిలో నమోదు కాలేదని తెలుపుతున్నారు.

ప్ర: ఆన్‌లైన్ కాని భూముల సమస్యను ఏ విధంగా పరిష్కరిస్తున్నారు?

జ: రైతుల వద్ద సాగు భూమికి సంబంధించిన వివరాల డాక్యుమెంట్లను పరిశీలిస్తాం. అనంతరం సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దానిపై విచారణ జరుపుతారు. ఆ తరువాత ఆన్‌లైన్‌లో భూమిని నమోదు చేస్తాం.

ప్ర: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను ఎలా పరిష్కరిస్తున్నారు.

జ: వచ్చే ప్రతి అర్జీపై స్వయంగా సమస్య ఉన్న ప్రాంతానికి వెళ్లి పరిశీలిస్తున్నాం. నిర్ణీత సమయంలోపే వాటిని పరిష్కరించడం జరుగుతుంది.

ప్ర: రేషన్ మాఫియా తెనాలి ప్రాంతంలో పెరిగిందని ఆరోపణలున్నాయి. వీటిపై మీరు ఏ చర్యలు తీసుకుంటున్నారు?

జ: రేషన్ డీలర్లకు, ఎండీయూ ఆపరేటర్లతో నెలలో కనీసం రెండుసార్లు సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. నిబంధనలు పాటించాలని సూచనలు చేస్తున్నాం. అకస్మాత్తుగా తనిఖీలు కూడా చేస్తూ అవినీతికి పాల్పడే వారిపై చర్యలు చేపట్టాం. ప్రస్తుతం అదుపులోకి వచ్చింది.

ప్ర: కార్డు దారులకు మీరేం చెప్పాలనుకుంటున్నారు?

జ: ప్రభుత్వం పేదల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో రూ.46కి కేజీ బియ్యం కొనుగోలు చేస్తోంది. తెల్లరేషన్ కార్డుద్వారా కేజీ రూ.1 అందిస్తూ వారికి అండగా నిలుస్తోంది. అపోహలు వీడి వాటిని వినియోగించుకోవాలని సూచిస్తున్నా.

ప్ర: రేషన్‌బియ్యం పెద్దమొత్తంలో పట్టుబడటానికి కారణం ఏమిటి?

జ: గ్రామాల్లో బియ్యంపై రేషన్ మాఫియా అనుమానాలు పెంచి వాటిని కిలో రూ.8-10 చెల్లించి నల్లబజార్లకు తరలిస్తూ అధిక మొత్తంలో సొమ్ముచేసుకుంటున్నారు. పేదలు నష్టపోయి దళారులు కోటీశ్వరులుగా మారుతున్నారు.

ప్ర: అవగాహనతో మార్పు వస్తుందంటారా?

జ: తప్పకుండా వస్తుంది. గతంలో లావు బియ్యం ఇచ్చేవారు. ప్రస్తుతం మీడియం సన్నబియ్యమే అందిస్తున్నాం. వాటిని అన్నం వండుకుని సద్వినియోగం చేసుకునేలా పేదలకు అవగాహన కల్పిస్తున్నాం.

వృద్ధ నిరుపేదలకు నిత్యాన్నదానం లక్ష్యం

● ఆపన్నహస్తం ఫౌండేషన్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఆపన్నహస్తం ఫౌండేషన్ కమిటీ సభ్యులు

కొల్లిపర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య నిరుపేదలకు నిత్యం అన్నదానం చేయాలన్నదే ఆపన్నహస్తం ఫౌండేషన్ లక్ష్యమని ఆపన్నహస్తం ఫౌండేషన్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర శివారు గుదిబండివారిపాలెం కల్యాణ మండపంలో ఆపన్నహస్తం ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి ఎస్.సుబ్బయ్య శర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న నిరుపేదలను ఆదుకోవాలనే సంకల్పంతో 1981-82 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసి వివిధ ఉద్యోగ, వృత్తులలో స్థిరపడిన వారి సహాయ సహకారంతో ఆపన్నహస్తం ఫౌండేషన్‌ను స్థాపించడం జరిగిందన్నారు. ఆపన్నహస్తం ఫౌండేషన్ మేనేజిమెంట్ కమిటీ సభ్యుడు గాది చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు నిత్యం వంద మందికి ఇంటికి వెళ్ళి క్యారేజీ ద్వారా అన్నదానం చేయలనే సంకల్పంతో ఉన్నట్లు తెలియజేశారు. ఆపన్నహస్తం ఫౌండేషన్ మేనేజిమెంట్ కమిటీ సభ్యుడు చీడేపూడి సురేష్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో వృద్ధాప్యంలో ఉన్న నిరుపేదలను ఆదుకోవడం కోసం కొల్లిపరలో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయటానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం వృద్ధులకు ఆపన్నహస్తం ఫౌండేషన్ మేనేజిమెంట్ కమిటీ సభ్యులు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ జొన్నల సాంబిరెడ్డి, రిటైర్డ్ ఎంఈవో ఆరిమండ బసవకుటుంబరెడ్డి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కొల్లి సూరారెడ్డి, ఈదా సాంబిరెడ్డి, కమిటీ సభ్యులు కొల్లి రాఘవరెడ్డి, కానాల రామిరెడ్డి, అవుతు సాంబిరెడ్డి, ఆరిమండ బేబి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలపై పోరాటం: ఆరేటి

పొన్నూరు టౌన్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగిస్తున్నట్లు ఆదివారం ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు తెలిపారు. నిర్మాణ రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 గంటలకు గుంటూరు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తునట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో 42వేల మంది కార్మికుల క్లయిమ్‌లు పరిష్కరించకుండా గత ప్రభుత్వం వదిలివేసిందన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వస్తే ఆ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఐదు నెలలు గడిచినప్పటికి సమస్యల పరిష్కారం కాలేదన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ ధర్నా నిర్వహిస్తునట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు, గుంటూరు ఏడుకొండలు, గుమ్మడి రోశయ్య, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ చెన్నంశెట్టికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



డాక్టర్ చెన్నంశెట్టి రమేష్

పొన్నూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మామిళ్ల పల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల దళిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ చెన్నంశెట్టి రమేష్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం విజయవాడలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ అవార్డుకు రమేష్ అందుకోనున్నారు. రమేష్ 3, 6,7, 9, 10 తరగతులకు చెందిన రాష్ట్ర ప్రభుత్వ గణిత పాఠ్యపుస్తకాల రచనలో పాలుపంచుకున్నారు. అలాగే 7వ తరగతి, 1 వర్క్ బుక్, 2 మాడ్యూల్స్ రూపొందించారు. 3 అంతర్జాతీయ సెమినార్లు, 12 జాతీయ సెమినార్లు, 2 రాష్ట్రస్థాయి సెమినార్లలో, యూజీసీ నిర్వహించిన సెమినార్లలోనూ రమేష్ పాల్గొన్నారు. ప్రాథమిక ఉపాధ్యాయ గణిత బోధనాభాస సామర్థ్యాలు, ఉపాధ్యాయ వృతిపట్ల అభిరుచి అనే పరిశోధన పత్రంతో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. చెన్నంశెట్టి రమేష్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికకావటంపై సహోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తెలుగు వెలుగుల సూరీడు సీపీ బ్రౌన్‌కు ఘన నివాళి

తెనాలి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగుల సీపీ బ్రౌన్ జయంతి వేడుకలు ఆదివారం నాజరుపేటలో నిర్వహించారు. శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తెలుగు తల్లికి నివాళి అర్పించారు. రంగిశెట్టి రమేష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ మాతృభాష కాకపోయినప్పటికి తెలుగు భాష మాధుర్యాన్ని గుర్తించి భాషా వికాసానికి బ్రౌన్ కృషి చేశారని చెప్పారు. పండితులను పోషించడం తెలుగు పుస్తకాలు ప్రచురించి ఉచితంగా పంచడం ఇందుకోసం తన సొంత ధనాన్ని సైతం సీపీ బ్రౌన్ వెచ్చించారన్నారు. తెలుగు వారు ఆయన కృషిని ఆదర్శంగా తీసుకొని తెలుగు భాష వైభవానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆళ్ళ నాగేశ్వరరావు, భీమేశ్వరప్రసాద్, విజయసారథి, హకీంజాని, సూర్య, నరసింహాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

వాకర్ క్లబ్-2 సమావేశం

తెనాలి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంచుపేటలో ఆదివారం వాకర్స్ క్లబ్-2 సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మధుమేహం వ్యాధి నిపుణులు ఎస్‌వీ కృష్ణారావు మధుమేహంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. క్లబ్ సభ్యులు డాక్టర్ కృష్ణారావును సన్మానించారు. వేజళ్ళ ఉమామహేశ్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మురహరిరావు, ఆనందరావు, భుజంగరావు, అంజిబాబు, రాఘవయ్య, సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తుల పరిశీలన

తెనాలి, మారీసుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆన్‌లైన్‌లో వచ్చిన 11,858 ఓటు నమోదు దరఖాస్తులను పరిశీలించి స్క్రూటినీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిశీలన అనంతరం దరఖాస్తులపై ఏఈఆర్‌వోగా సంతకంచేసి, ఈఆర్‌వో ఆమోదంకోసం వాటిని గుంటూరు కార్యాలయానికి పంపిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

క్రైమ్ జోన్

పీడీఎఫ్ బియ్యం స్వాధీనం

కొల్లిపర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న పీడీఎఫ్ బియ్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. కొల్లిపరకు చెందిన ముద్దరబోయిన శివకృష్ణ రేషన్ బియ్యానికి సంబంధించిన ప్రభుత్వ వాహనాన్ని నడుపుతున్నాడు. ఇతను ప్రభుత్వానికి సంబంధించిన 18 బస్తాల బియ్యాన్ని ఇతర వాహనం ద్వారా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

పెదకాకాని శివయ్య సన్నిధిలో భక్తుల సందడి




ఆలయంలో కార్తీక దీపరాధన చేస్తున్న భక్తులు

పెదకాకాని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శివయ్య సన్నిధిలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం కార్తీక మాసం కారణంగా విశేషంగా భక్తజనులు తరలివచ్చారు. ఆలయంలో స్వామి వారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తీకమాస 2వ ఆదివారం వేకువజామున భక్తులు యజ్ఞాల బావి వద్ద కార్తీకమాస స్నానమాచరించి భక్తి శ్రద్ధలతో శ్రీ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపారాధనలు చేశారు. క్యూలైనులలో భక్తులకు పాలు, మజ్జిగ, తాగునీరు అందించారు. ఉపకమీషనరు కె.బి.శ్రీనివాసరావు ఏర్పాట్లను పరిశీలించి భక్తులకు ఏ విధమైన అసౌకర్యము కలుగకుండా సిబ్బందికి తగు సూచనలు చేసినారు. కార్తీకమాస 2వ ఆదివారము వివిధ సేవా రుసుములు, ప్రసాద విక్రయం, అన్నప్రసాద విరాళాల ద్వారా రూ.6,00,000/-లు పైచిలుకు ఆదాయం వచ్చినట్లు ఉపకమిషనరు, కార్యనిర్వహణాధికారి కె.బి.శ్రీనివాసరావు తెలిపారు.

భక్తి ప్రపత్తులతో సత్యదేవ వ్రతాలు

తెనాలి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురంలోని లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం, బోసురోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం సత్యదేవ వ్రత మహోత్సవాలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. వైకుంఠపురం ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని 2వ వారం జరిగిన వ్రతాల్లో పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. ట్రస్టు బోర్డు చైర్మన్ కంభం సాయిబాబు, ఈవో అనుపమ, అర్చక సిబ్బంది కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. బోసురోడ్డులోని ఆలయంలో శ్రీవాసవి యూత్ ఆధ్వర్యంలో 12వ సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. యూత్ అధ్యక్షుడు రజనీకుమార్, కార్యదర్శి హరికిషోర్, సుగ్గుల శ్రీనివాసరావు, మాజేటి బదరీ, సతీష్, శ్రీనివాస్, తదితరులు పర్యవేక్షించారు. ప్రజ్ఞానంద సరస్వతీ స్వామిజీ భక్తులనుద్దేశించి ప్రవచనం చేశారు.



లలితా సహస్ర నామ పారాయణలో పాల్గొన్న భక్తులు

కార్తీక మాస వనసమారాధనల సందడి

తెనాలి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలో ఆదివారం కార్తీక వన సమారాధలతో సందడి నెలకొంది. నాజరుపేటలోని విద్యాశంకర భారతి నృశింహ సదనంలో వేదిక్ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. శివుడికి రుద్రాభిషేకం జరిపి అనంతరం లలితా విష్ణుసహస్ర నామ పారాయణం చేశారు. పట్టణం, పరిసర గ్రామాల్లోని బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో సమారాధనకు హాజరయ్యారు. సమాఖ్య అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణమూర్తి, తిరుమలరావు, శ్రీనివాసమూర్తి, సీతారామాంజనేయశాస్త్రి, సుబ్రహ్మణ్యం, అనీల్, వేణుగోపాల్, పద్మజ, విజయసారథి, ప్రసాద్‌లు పర్యవేక్షించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలో వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ట్రాన్స్‌కో ఎస్ఈ అవుల మురళీకృష్ణయాదవ్, తాడిబోయిన రమేష్, కుర్రా సుజాత, తాడిబోయిన అఖిలేష్, తాడిబోయిన శ్రీనివాసరావు, తాడిబోయిన హరిప్రసాద్, రామయ్య యాదవ్, అతిథులుగా పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో బాలబాలికలు అలరించారు. అప్పారావు బృందం కోలాటం ప్రదర్శించింది.

అమర కళాకారులకు నివాళి

తెనాలి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పౌరాణిక నాటక కళాకారులు మున్నంగి జగన్‌కుమార్, రంగస్థల నటి పంతుల జయవాణి ఇటీవల మృతి చెందగా, పట్టణ రంగస్థల కళాకారుల సంఘ భవనంలో రంగస్థల కళాకారులు ఆదివారం వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మీ మాట్లాడుతూ రంగస్థలంపై సేవలు అందించిన కళాకారులను స్మరించుకుని వారి స్మారకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆరాధ్యుల కోటేశ్వరరావు, సుబ్బారావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆట స్థలం ప్రారంభం

తెనాలిరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపేటలో వసుధైక కుటుంబం బృందం సహకారంతో ఏర్పాటుచేసిన చిన్నారుల ఆట స్థలాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ చిన్నారులకు ప్రతి గ్రామంలో ఆట స్థలం ఉండాలన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనలతో ఖాజీపేటలో రూ.లక్ష వ్యయంతో చిన్నారుల ఆట స్థలాన్ని అభివృద్ధి చేశామన్నారు. నేడు పిల్లలు ఎక్కువగా సెల్‌ఫోన్‌లను బానిసలుగా మారుతున్నారని, శారీరక క్రీడలకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

సోషల్ మీడియా ద్వారా పవన్‌కల్యాణ్ అభినందనలు

ఖాజీపేటలో వసుధైక కుటుంబం బృందం చిన్నారులకు ఆటస్థలం ఏర్పాటు చేసి ప్రారంభించినట్లు సోషల్ మీడియాలో పోస్టు పెట్టగా, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆ పోస్టుని చూసి, వారిని అభినందిస్తూ 'ప్రతి గ్రామంలో యువత ఇటువంటి మంచి కార్యక్రమాలకు ముందుకు రావాలి. చిన్నారులు ఆహ్లాదకరమైన వాతావరణంలో సంతోషంగా జీవించేలా ఆట స్థలాలు దోహదపడతాయయి' అని పోస్టు పెట్టారు.

కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన భవన ప్రారంభం

తెనాలి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం అంగలకుదురులో కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన భవనాన్ని ఆదివారం బీజేపీ నాయకురాలు యడ్లపాటి స్వరూపరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాతాదారులకు కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ మెరుగైన సేవలు అందిస్తుందని అన్నారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తూ సామాన్య ప్రజలకు ఆర్థిక చేయూత అందిస్తుందన్నారు. సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు, ఆడిటర్ హరిబాబు, రోటరీ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్‌లు ఆయా విభాగాలను ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ సొసైటీ 10 శాఖకు చేరిందని, ఐదు శాఖలకు సొంత భవనాలు ఏర్పాటు చేసుకోగలిగామని, 70మందికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, జీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య, జెట్టి రేణుక, షైనేని రత్నప్రసాద్, కేసన కోటేశ్వరరావు, సూర్యదేవర వెంకట్రావు, న్యాయవాది వెలినేని రాఘవయ్య, చంద్రమౌళి, చక్రధర్, పి.ఎస్.ఆర్.బ్రహ్మాచార్యులు, కార్యదర్శి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

మెగా కంటి వైద్య శిబిరం

● 500 మందికి పరీక్షలు



కంటి పరీక్షలను నిర్వహిస్తున్న డాక్టర్ రుతుజా, వాసవి సేవా సంఘ సభ్యులు తదితరులు

తెనాలి, మారీసుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్య విద్యానిధి ప్రాంగణంలో ఆదివారం శ్రీవాసవి సేవా సమితి, పట్టణ ఆర్యవైశ్య సంఘం, జిల్లా అంధత్వ నివారణ సంస్థ గుంటూరు సంయుక్తంగా శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీవాసవి సేవా సమితి అధ్యక్షుడు వరదా వెంకట శేషగిరిరావు అధ్యక్షతన ముఖ్య అతిథిగా పట్టణ మున్సిపల్ మాజీచైర్మన్ పెండేల వెంకట్రావు పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో కంటి వైద్యుడు డాక్టర్ రుతుజా 500 మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. వారిలో 150 మందికి కంటి శస్త్ర చికిత్సలను నిర్వహించాలని తెలిపారు. అందులో భాగంగా 40మందిని మంగళగిరిలోని శంకర కంటి ఆసుపత్రికి బస్సులో తరలించారు. మిగిలిన వారిని దఫాలవారీగా తరలించి కంటి శస్త్ర చికిత్సలను ఉచితంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీవాసవి సేవా సంఘం సెక్రటరీ పెండేల సుబ్బారావు, సభ్యులు టి సుధాకర్, నిడమానూరి సూర్యనారాయణ, గుర్రం సుధీర్, విశ్వనాధం, సాంబశివరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వెరికోస్ వెయిన్స్ నిర్ధారణ వైద్యశిబిరం

తెనాలి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద, ఈగల్ రెస్టారెంట్ ఆవరణలో వెరికోస్ వెయిన్స్ (కాళ్ళ రక్తనాళాలవాపు వ్యాధి) పరీక్షల వైద్యశిబిరం నిర్వహించారు. ఏషియన్‌వాస్కులర్ హాస్పటల్ వైద్య బృందం వెరికోస్ వెయిన్స్ ఉన్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అనీ ల్, సాయితేజ, కుమార్, క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, ఎ.వెంకట్రామయ్య, రాజేంద్రప్రసాద్, నరేంద్ర, ఉపేంద్ర పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చౌడేశ్వరి అమ్మవారి దేవాలయ నిర్మాణానికి లక్ష విరాళం



శ్రీచౌడేశ్వరి దేవాలయానికి లక్ష రూపాయలు విరాళంగా ఇస్తున్న భీమవరపు ప్రసాదరెడ్డి దంపతులు

కొల్లిపర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో శ్రీచౌడేశ్వరి అమ్మవారి దేవాలయం నిర్మాణానికి ఎన్ఆర్ఐ భీమవరపు నాగిరెడ్డి అందజేసిన లక్ష రూపాయల విరాళాన్ని వారి తల్లిదండ్రులు భీమవరపు ప్రసాదరెడ్డి, కాంతమ్మ, సోదరుడు భీమవరపు లంక కోటిరెడ్డి, సునీత దంపతులు ఆదివారం దేవాలయం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీచౌడేశ్వరి దేవాలయం కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీచౌడేశ్వరి అమ్మవారి దేవాలయం నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో దేవాలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



బాలిక కుటుంబానికి ఆర్థికసాయం అందచేస్తున్న ముస్లిం నాయకులు

వైద్యం కోసం బాలిక కుటుంబానికి సాయం

పొన్నూరు టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని ముబారక్ నగర్‌కు చెందిన పఠాన్ ఆయూబ్ ఖాన్ కుమార్తె వైద్యం కోసం పట్టణంలోని ముస్లింలు ఆదివారం రూ.38వేల ఆర్థికసాయాన్ని అందచేశారు. పఠాన్ షరీనా బ్రెయిన్‌లో ఇన్ఫెక్షన్ కారణంగా చికిత్స పొందుతున్నారు. 21వ వార్డు ముస్లిం యూత్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.33వేలు సేకరించారు. అలాగే ఏపీజే అబ్దుల్ కలామ్ షాదీఖానా నిధుల నుంచి రూ.5వేలు మొత్తం రూ.38వేల ఆర్థికసహాయాన్ని ముస్లిం మైనార్టీ నాయకులు ఆయూబ్ ఖాన్‌కు అందచేశారు. కార్యక్రమంలో పొన్నూరు పట్టణానికి చెందిన పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.